UTF

# ఐక్య ఉపాధ్యాయ

సంపుటి 4 ★ సంచిక 4 ★ ఏప్రిల్ 1978




రూ. 1

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

# పాఠకుల అభిప్రాయాలు

ఫిబ్రవరి ముఖచిత్రం ఎంతో భావగర్భితంగా ఉన్నది. రుక్మిణి గారు 'పాలకుల దృష్టిలో ప్రాణాల విలువను' చక్కగా చిత్రించారు. వారికి నా అభివందనలు.

— రంగాసుబ్రహ్మణ్యశాస్త్రి, పుసులూరు.

ఫిబ్రవరి పత్రిక చూశాను.... ప్రేమతో అంతా చదివాను
సంపాదకీయంలో నిజాలు....కంపనను సృష్టించాయి
పేరివిజన్ కమిషనర్ కిచ్చిన నివేదిక.... మెను ఆశల మది రేపాయి.
మన పత్రిక ఆశా దీపిక....మనసును ఊపే జ్వాలిక

— కూరపాటి శేషంరాజు, మాధాపురం.

ఫిబ్రవరి సంచికలో 'పుం భజన' మినీ కథ అవకాశవాదుల, చెక్కభజనగాళ్ళ చెంపచెళ్ళుమనిపించేట్టు ఉంది. పత్రిక జాప్యాన్ని భరింపలేను.

— జి. యస్. ప్రసాదరావు, పాలకొల్లు.

పత్రిక చేతికందినపుడల్లా ప్రాణం లేచివచ్చినట్టుంటుంది.

— ఎ. మధుసూదనరావు, మ॥ నగర్ జిల్లా,

ప్రశ్నల శీర్షిక బాగా పెంచండి. అది ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నది. చెన్నుపాటి భవన విధి సమితి వారీగా పేర్లతో ప్రకటించండి — వి. ప్రకాశరావు, పెద్దాపురం సమితి.

ఫిబ్రవరి కార్టూన్ చీమలబారులా గజిబిజిగావుంది. బహుశా ఈ లోపానికి కారణం ఒకే కార్టూన్‌లో ఎక్కువ వివరాలు చూపించాలనుకోవటమే. — ఇ. అప్పారావు, రేపేంద్రపాడు.

ఫిబ్రవరి ముఖచిత్రం ఎయిడెడ్ టీచర్ల నికృష్టస్థితిని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తేటతెల్లం చేస్తున్నది.

ఎం. వి. ఎస్. సుబ్రహ్మణ్య శర్మ, తోటపల్లి.

మార్చి సంపాదకీయం వాస్తవ పరిస్థితులకు అనుగుణ్యంగా వుంది. కె. వెంకట స్వామి, దమ్మాలపాడు.

ఉపాధ్యాయవర్గ చైతన్యాన్ని పెంపొందిస్తూ, రకరకాల ఆకర్షణలతో పత్రిక వెలువడటం ప్రశంసనీయం.

— భీమానందావారి, పట్టపాక,

## ప్రధాన సవరణ

మార్చి 78 సంచికలో 'విద్యారపు ఉత్తర్వుల' శీర్షిక క్రింద ప్రచురింపబడిన విషయంపై ఈ క్రింది సవరణ ప్రచురింప గోరుతున్నాను. 1969 సం॥ 96_200స్కేలులో రు. 126/_తో ప్రారంభ వేతనం పొందినవారికి మాత్రమే వర్తింపచేయక అందరికీ వర్తించునట్లు దానిలో వ్రాసియున్నారు. జి.ఓ.యం.యస్. నెం. 1120(విద్య) తేదీ 7_12_77 ననుసరించి మిగిలిన వారికి ఆ ఉత్తర్వు ఏ విధంగాను అడ్డురాదు.

డి. జనార్దనరావు, గేదెల్లంక.

(ఆ జి. ఓ. లో 1_1_1974 తర్వాత అదనపు విద్యార్హతలు సంపాదించిన ఇంక్రిమెంట్లు రావు అని లేదు. అది ప్రధానంగా హైయర్ స్టార్టు పొందిన సెకండరీ గ్రేడ్ వారికి రికవరీ రాకుండా నివారించుటకు యిచ్చిన వివరణగా గ్రహింప గోరుతున్నాం. సం॥)

# సంపాదక లేఖలు

## కంచెలే చేనుమేస్తున్న వైనం

నేను ఒక పేద వెనుకబడిన కులమునకు చెందిన దానను. భర్త చదువుకొన్న నిరుద్యోగి. నేను 1973_74లో బాల్వాడీటీచరు ట్రయినింగు ప్యాసైనాను. 1975 జనవరినుండి 1976 ఏప్రిల్ 30 తేదీవరకు ఆత్మకూరు సమితిలో బాల్వాడీ టీచరుగా పనిచేసినాను. 23-1_78 తేదీన పొదలకూరు సమితిలో బాల్వాడీ టీచర్ను నియామకమునకు ఇంటర్వ్యూ జరిగినది. సదరు ఇంటర్వ్యూకు నేను మరియు వెంకటగిరి తాలూకానుండి ఇద్దరు ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజి వారిద్వారా హాజరయితిమి. కాని స్పెషల్ ఆఫీసరుగారి ప్రత్యేక శ్రద్ధతో ఆ జరిగిన ఇంటర్వ్యూ రద్దు చేయబడి ప్రత్యేకముగా ఇంటర్వ్యూరాని వేరొక అభ్యర్థినికి మరల ప్రత్యేక ఇంటర్వ్యూ జరిపి ఆ ఉన్న ఒకఖాళీని నింపుట జరిగినది.

జరుగనున్న ప్రమాదమును ముందుగానే గుర్తెరిగి స్పెషల్ ఆఫీసరుగారిని కలిసికొంటిమి. కాని స్పెషల్ ఆఫీసరుగారు మీకెన్ని అర్హతలున్నను ఆయుద్యోగము మీకిచ్చుట జరుగదు. నేనింతకు ముందే ఒకరితో ఒప్పందము చేసికొనియున్నాను. ప్రత్యేక ఇంటర్వ్యూ జరిపియైనా వారికి ఆ ఉద్యోగము ఇస్తాను అని తన అధికారదర్పాన్ని ప్రదర్శించినారు.

తరువాత ఈ అన్యాయమును మా తండ్రిగారు జిల్లాకలెక్టరు గారి దృష్టికి వ్రాతమూలకముగా 4_2_1978 తేదీన విన్నవించినారు. మాకు న్యాయము జరుగకపోగా స్పెషల్ ఆఫీసరుగారు 6_3_1978 తేదీన తనలభ్యర్థినికి ప్రత్యేకముగా ఇంటర్వ్యూ జరిపి ఆమెను ఉద్యోగములో నియమించినట్లు తెలియుచున్నది.

కావున పై అధికారులు ఈ విషయమును ఆ మూలాగ్రము పరిశీలించి నాకు జరిగిన ఈ ఘోరమగు అన్యాయమును అరికట్టి న్యాయమును చేకూర్చవలసినదిగా కోరుచున్నాను.

— డి. శారదమ్మ, సిద్దన కొండూరు, నెల్లూరుజిల్లా.

## ప్రతి శనివారం శలవుదినంగా వుండాలి

ప్రస్తుతం పాఠశాలలు 220 × 6 = 1224 గంటలు పనిచేస్తే, ప్రతి శనివారం శలవు ఇవ్వవచ్చు. పాఠాలు ప్రిపేర్ కావటానికి, టీచింగ్ నోట్సు వ్రాసుకోటానికి, ఎసైన్‌మెంట్లు, కాంపోజిషన్లు దిద్దుకోటానికి, మానసికగ్లాని తగ్గించుకోటానికి ఆ శలవు దినం అత్యవసరం. ప్రతిరోజూ 8 గంటలను 8 పీరియడ్ళుగా విభజిస్తే వారానికి 5 × 8 = 40 పీరియడ్ళవుతాయి. ఇంగ్లీషు 6, తెలుగు 6, లెక్కలు 6, సైన్సు 9, సోషల్ 5, హిందీ 3, డ్రిల్లు 3, కాంపోజిషన్, పి.టి., మోరల్, డిబేట్లకు కలిపి 2గా కేటాయింపు జరుపవచ్చు.

'ఒక ఉపాధ్యాయుడు'

## నెల్లూరు బి. యిడి. శిక్షణా కేంద్రంలో ఇన్‌సర్వీసు టీచర్ల ప్రవేశానికి కటకటలు

1977_78 విద్యాసంవత్సరంలో నెల్లూరు ప్రభుత్వ బి. యిడి. శిక్షణా కేంద్రంలో ఇన్‌సర్వీసు టీచర్లను 8 మందిని మాత్రమే

(మిగతా మూడవ కవరుపేజీ)

IUV01A136

IKYA UPADHYAYA

Life Subscription 116-00
Yearly „ 10-00
Single Copy 1-00

Ikya Upadhyaya
Akulavari Street,
Vijayawada-2

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదక వర్గం :
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
నాదెళ్ళ సీతారామాచారి
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటుస్వామి
మోతుకూరు నరహరి

సంపుటి 4 ఏప్రిల్ 1978 సంచిక 4

## అక్రమాల నరికట్టండి! అన్యాయాలనెదుర్కొనండి!

ఉపాధ్యాయ సంక్షేమానికి, విద్యారంగ అభివృద్ధికి జి. ఓ. లను సాధించుకోవటం ఒక పోరాటమైతే, వాటి అమలు జరిపించుకోటానికి అంతకంటె తీవ్రమైన పోరాటం చేయాల్సివస్తున్నది. పంచాయత్ రాజ్‌లో అటువంటి ఆటంకాలు అడుగడుగునా ఎదురౌతున్నాయి. ఇక ఎయిడెడ్ సంస్థలలో ఎదురౌతున్న దురన్యాయాలకు అంతేలేదు.

వాటి నెదిరించటానికి ఉపాధ్యాయవర్గం సంఘటిత శక్తితో ముందుకుపోవటం, గత్యంతరంలేని స్థితిలో ఆందోళనకు పూనుకోవటం, దానిపై నిరంకుశాధికారులు కక్షా చర్యలద్వారా భీతావహం వ్యాపింపజేసి విద్యాలయాల్లో ప్రశాంతతకు భంగం కల్గించటం సర్వసాధారణమై పోయింది.

### సంపాదకీయం

— గుంటూరు జిల్లాపరిషత్ టీచర్ల సి. డి. చెక్కు ప్రబల ప్రయత్నంతో ఫిబ్రవరి 21న జడ్.పి. ఆఫీసుకు చేర్చబడింది. కాని టీచర్లకు నెల గడిచింతర్వాత మార్చి చివరలో, రావాల్సినదానిలో మూడవ వంతు మినహాయించబడింది. తుఫాన్‌బాధితులైన జడ్. పి. ఉద్యోగులు మాత్రం జి. ఓ. వచ్చిన మర్నాడే మూడునెలల క్రితం మొత్తం సి.డి. పుచ్చుకోవటం, అదేబాధకు గురైన టీచర్లకుమాత్రం తామై పూనుకొని సి. డి. చెక్కు తెచ్చుకొన్నా, అసంపూర్తిగా ఇవ్వటం దారుణం.

— రాష్ట్ర యు.టి.యఫ్. ఆదేశానుసారం, చిత్తూరు సమితి టీచర్లు జిల్లాలో ఇతర టీచర్లతోపాటు తమ న్యాయమైన హక్కుల కోసం ఫిబ్రవరి 19న ధర్నాలో పాల్గొంటే, సమితి బి.డి.ఒ. వారి శలవుల్ని శాంక్షన్ చేయకపోవటం, అపైన బెదిరింపులు, సంజాయిషీలతో నిరంకుశంగా వ్యవహరించటం జరుగుతున్నది.

— మొగల్తూరు సమితిలో అపరిష్కృత సమస్యలపై ఆందోళనకు పూనుకోగా శలవుల్ని నిరాకరించటం, పెత్తందార్ల ఒత్తిడులుతెచ్చి లేనిపోని రిపోర్టులు పెట్టించి, యు. టి. యఫ్. నాయకుల్ని సరెండర్ బదిలీలకు గురిచేసి, స్పెషల్ ఆఫీసర్ అధ్వర్యంతో జరిగిన సంప్రదింపుల్ని, హామీల్ని ఖాతరు చేయక ఇష్టారాజ్యపాలన సాగుతున్నది.

ఇవన్నీ ఒకఎత్తుకాగా విజయవాడ యస్.కె పి.వి.పి. హిందూ హైస్కూళ్ళ కమిటీ అనుసరిస్తున్న మొండివైఖరి టీచర్లయెడ మరింత దురన్యాయంగా పరిణమించింది.

జి.ఓ.ల అమలు కోసం, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం హిందూ హైస్కూళ్ళ ఉపాధ్యాయవర్గం ఆందోళనకు పూనుకొని ఆరురోజుల అమరణ నిరాహారదీక్ష తర్వాత కలెక్టర్ గారి జోక్యంలో డి.ఇ.ఓ. ముందు మేజిస్ట్రేట్ పవర్స్‌తో వచ్చిన తహసీల్దారుముందు జరిగిన సంప్రదింపుల్ని, ఇచ్చిన హామీల్ని త్రోసిరాజనటం, అసలు ఒడంబడికే జరగలేదని కరపత్రాలద్వారా మొదటికే మోసంతేవటం, కక్షాచర్యగా ఆందోళనకు పూనుకొన్న టీచర్ల శలవులు శాంక్షన్ చేయకజీతాలు కట్‌చేయటం, మళ్ళీ అందులోకూడా "విభజించి పాలించే సూత్రం" అవలంబించి ఒకరిద్దరికి మాత్రం జీతాలు చెల్లించటం, విద్యాలయాల్లో విపరీత అశాంతి కల్పించటం ఒక కుట్రగా సాగుతున్నది.

కాని గర్హణీయమైన విషయమేమిటంటే "ఉపాధ్యాయ సంక్షేమమే తమ ధ్యేయమనీ, వారి హక్కుల్ని రక్షించటమే తమ లక్ష్యమనీ" గొంతులు చించుకొనే కొన్ని సంఘాలు మేనేజిమెంటుకు వత్తాసుగా కరపత్రాలు వేసి, వారి కుట్రలో భాగస్వాములుకావటం, టీచర్లను వెన్నుపోటు పొడవటం జరిగింది.

ఈ విద్రోహ వైఖరి ఎక్కడికి దారితీస్తుంది ?

ఎవరికి లాభం కలిగిస్తుంది ?

నిరంకుశ మేనేజిమెంట్లకా ? జీవన్మరణ పోరాటం జరిపే ఉపాధ్యాయ వర్గానికా ?

ఈ విధమైన విచ్ఛిన్న వైఖరిని ఉపాధ్యాయ వర్గమంతా ఖండించాలనీ, మరింత సంఘటితశక్తితో అన్యాయాల్ని అక్రమాల్ని ఎదిరించాలనీ.... అంతిమ విజయం మనదేనని యీ సందర్భంగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

★

ప్రధాన సవరణ: 23వ పేజీలోగల జీవితచందాలలో 206 యం. బి. కామయ్య, ఇంజారం, తూ. గోదావరి జిల్లా అని ఉండాలి.
—సం.

# మీ మొదటి ఓటిచ్చి గెలిపించండి

## తూర్పు తెలంగాణా ఉపాధ్యాయ నియోజకవర్గ

# ఓటరు మహాశయులకు విజ్ఞప్తి



మహాశయులారా!

1978 జులైలో జరుగనున్న తూర్పుతెలంగాణా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా, ఉద్యమ శ్రేయోభిలాషుల కోరికపై పోటీచేయుచున్నాను. నన్ను ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ బలపరుస్తున్నది.

నేను గత 15 ఏళ్ళనుండి ఖమ్మంజిల్లా పరిషత్ హైస్కూళ్ళలో బి.యిడి. అసిస్టెంటుగా, ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ, ఉపాధ్యాయ ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధాలు గల్గి ఉపాధ్యాయ సమస్యా పరిష్కారానికి, వృత్తి సంక్షేమానికి నా శాయశక్తులా కృషిసాగిస్తున్నాను.

విద్యావిధానపు అభివృద్ధికి, సమైక్య ఉద్యమ నిర్మాణానికి, మేనేజిమెంటు కేటగిరీ ప్రాంతీయ విభేదాలు లేకుండా అందరు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసనమండలి సభ్యత్వాన్ని వినియోగింపగలను.

కాన మీ మొదటి ఓటు నాకిచ్చి మీ మిత్రులద్వారా ఇప్పించి

**నన్ను గెలిపించ ప్రార్థన.**

ఖమ్మం,
3-4-78

భవదీయుడు,
జి. లక్ష్మయ్య.

---

## శ్రీ లక్ష్మయ్యగారిని బలపర్చుతూ యు. టి. యఫ్. ప్రకటన

మహాశయులారా?

1978 జులైలో జరుగనున్న తూర్పు తెలంగాణా ఉపాధ్యాయనియోజకవర్గ ఎన్నికలలో శ్రీ జి.లక్ష్మయ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు వారు గత పదిహేనేళ్ళ నుండి ఉద్యమ కార్యకర్తగా ఉపాధ్యాయ సంక్షేమానికి, వృత్తి భద్రతకు నిస్వార్థంగా, త్యాగశీలతతో సేవచేస్తున్నారు.

వీరి అభ్యర్థిత్వాన్ని ప్రాంతీయ హద్దుల్ని బద్దలుకొట్టి, మేనేజిమెంటు కేటగిరీ విభేదాలనధిగమించి, ఒకే ప్రభుత్వం క్రింద, ఒకే విద్యావ్యవస్థక్రింద పనిచేస్తున్న అందరు ఉపాధ్యాయులను ఒకే వేదికమీదకు సమీకరించే ఆశయంతో కృషి సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ బలపరుస్తున్నది.

యు. టి. యఫ్. గత నాలుగు సంవత్సరాలుగా పీడితోపాధ్యాయుల పెన్నిధిగా వేలాది ఉపాధ్యాయుల సమీకరించి, నిర్భయంగా సమస్యల్ని ప్రభుత్వ దృష్టికితెచ్చి, అత్యవసర పరిస్థితిలోకూడా అనేక పోరాటాలు నడిపి, ఇటీవల తక్షణ సమస్యలపై రాష్ట్రవ్యాప్త ధర్నా పోరాటం నిర్వహించి సమరశీల సంస్థగా పేరుపొందింది. ఈ సంస్థ నడుపుతున్న 'ఐక్య ఉపాధ్యాయ' పత్రిక ఉపాధ్యాయులందరిని చైతన్యపరచి సంఘటిత పరచే శక్తిగా అచిరకాలంలోనే అందరి ఆదరాభిమానాలు చూరగొని ఉద్యమ ప్రతిబింబంగా ఉపాధ్యాయులకు సేవచేస్తున్నది.

శాసనమండలి వెలుపలగల ఉద్యమ పోరాటాల్ని శాసనమండలిలోపల ఉపాధ్యాయ ప్రతినిధుల కృషితో సమన్వయం జరపటం ద్వారా ఈ పాలక వ్యవస్థలో ఏ మేరకైనా కొంత ప్రయోజనాన్ని సాధింపవచ్చని యు. టి. యఫ్. విశ్వసిస్తోంది. అందుకొరకు ఉపాధ్యాయుల ప్రయోజనాలకు అంకితమైన అచంచలదీక్షతో పనిచేసే ఉద్యమ కార్యకర్తల్ని ఉపాధ్యాయ ప్రతినిధులుగా శాసనమండలికి ఎన్నికచేసి పంపే బాధ్యతను గుర్తించి యు.టి.యఫ్. శ్రీ లక్ష్మయ్యగారి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నది. కాన వారికి మీ మొదటి ఓటునిచ్చి, అఖండ విజయం సమకూర్చాలని ఓటరు మహాశయులందరికి విజ్ఞప్తి చేస్తున్నాం.

విజయవాడ,
3-4-78

ఇట్లు,
ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్.

# కవితలు గేయాలు!

## తలెత్తు!

— శ్రీ వి.వై.వి. సోమయాజి, ఆకివీడు.

ఓయీ ! ఎవరు నువ్వు ?
ఓహోయీ ! ఎవరు నువ్వు ?
మూడు పదులైనా నిండకుండా
మూలుగుతూ కనబడతావేం ?
నడుం వంగి.... నడలు సడలి
ఒడలు బడలి.... తడబడుతూ నడుస్తావేం ?
ఎవరివోయీ ! ఎవరు నువ్వు ?
ఓహో.... తెలిసిందిలే !
నువ్వు బడిపంతులివి కదూ !
అరె.... నువ్వు జాతి వెన్నెముకవు.. !
భావి పౌర శిక్షకుడివికదోయ్ !
నువ్వే వంగిపోతే దేశం గతేంకాను ?
నువ్వే లొంగిపోతే జాతి భవిష్యత్తేంగాను?
లే.... లే.... లేచి తలెత్తు !
అంతా నీ శిష్యులేగా !
మంత్రులూ.... సామంతులూ
అధికార్లూ.... అనధికార్లూ
డాక్టర్లూ.... యాక్టర్లూ !
నీ శిష్యులు ఉపన్యాసాలిస్తూ
'బడిపంతులు మొదలు రాష్ట్రపతి దాకా'
'పిపీలిక మొదలు పరబ్రహ్మదాకా'
—అనే సామెతకు సామ్యంగా మాట్లాడతారు
అది నీకు చిన్నతనం అనుకోకు
అందర్నీ పైకెత్తేవాడు క్రిందే వుండాలిగా
క్రిందినుంచిమీదిదాకా అంతా నీ శిష్యులే
వాళ్ళు పెద్ద పెద్ద ఆఫీసర్లయి.... మహామాత్యులై
నీ జీతనాతాలు నిర్ణయిస్తారు.
వారు కావాలనే నీ బ్రతుకు దిగగోస్తారు.
అది 'కృతఘ్నత' అనుకోకు సుమా!
'కతజ్ఞత' అవుతుంది దాని పరమార్థం!
పొట్టనిండిన వాళ్ళంతా
నిదరమత్తులో ఉంటారటగా;
ఆకలిమంటల సెగలకు కాగే
బుద్ధిలోనే పుడతాయట
గొప్పగా ఆలోచనలూ
చక్కని చిక్కని భావాలూ!
నిన్నలా ఉంచబట్టే నువ్వు
జాతికి వెన్నెముక వయ్యావుట !
నిన్నొక్కడినే కాదు అలా ఉప్పేసేది
భూమి దున్నే బక్క రైతునూ
కర్మాగారపు కార్మికుణ్ణి
కుర్చీ కతుక్కున్న గుమస్తానీ
అందర్నీ.... నీ వాళ్ళందర్నీ
అలా ఉప్పేస్తూనే ఉన్నారు
పబ్బం గడుపుకోడానికి ;
కాని నీవు విజ్ఞాన దీపానివి ;
ఆ మోసమంతా ఎంతసేపు ?
కష్టజీవులతోపాటు ఓసారి తలెత్తు
ఓ దెబ్బకే ఆ మాయంతా చిత్తు.... చిత్తు !

నిజం కథ

## చచ్చినవాడికా ఉద్యోగం!

— "రత్నం"

మళ్ళీ ఉత్తరం వచ్చింది. ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజినుండి.... ఉద్యోగంలో జాయిన్ కమ్మని... కొడుకుపేర.

అది చూడగానే నిలువునా నిర్వీణ్ణుడయ్యాడు రామయ్య పంతులు.

గుండెలో గాయం మళ్ళీ కెలికినట్టయింది.

కొడుకు చనిపోయి మూడు సంవత్సరాలు.

వాడు ఉద్యోగంకోసం ఎదురు చూసిచూసి ఆ దిగులుతోనే మంచంబట్టి మరణించాడు.

చనిపోయిన సంవత్సరానికి ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజినుండి ఉద్యోగాహ్వానం వచ్చింది.

అప్పుడే రాశాడు ఆ యాఫీసుకు.... కొడుకు చనిపోయిన సంగతి.

మళ్ళీ సంవత్సరానికి అదే ఆహ్వానం !

"ఇదేం చిత్రవధ.... నా కొడుకు లేడంటూ" రిజిష్టర్ ఉత్తరం రాశాడు ఆసారి.

వాళ్ళకు ఉత్తరాలూ, రిజిష్టర్లూ అందవేమో మళ్ళీ యిప్పుడు అదే ఆహ్వానం వచ్చింది.

ఇది కొడుక్కి ఉద్యోగమీయటమా ? లేక జరిగిన విషాదాన్ని మళ్ళీమళ్ళీ గుర్తుకుతెచ్చి కన్నవాళ్ళనికూడా దారుణ వ్యధపాలు చేయటమా ? — అర్థంగాక తనయుడి ఫొటోవంక దీన దృక్కులతో చూశాడు రామయ్య పంతులు.... బ్రతకలేని రిటైర్డ్ బడిపంతులు.

★

---

**అమలాపురం సమితి :** సమితిలోని అపరిష్కృత ఏప్రిల్ 23 లోపల పరిష్కరించాలని, లేనిచో ఆ తర్వాత సమితి ఆఫీసుముందు ప్రత్యక్ష చర్య జరుపగలమని సమితి యు.టియఫ్. శాఖ 20 సమస్యల్ని ఉదహరిస్తూ స్పెషల్ ఆఫీసర్‌గార్కి 22-3-78 న నోటీసు ఇచ్చింది.



ఉపాధ్యాయుల ఇబ్బందులకు నల్లగొండ జిల్లాది ప్రత్యేక స్థానం. అందునా నక్రేకల్లు సమితిది విశిష్టస్థానం. అక్కడి సమితి విద్యా విస్తీర్ణాధికారి చర్యలే దానికి ప్రత్యక్ష ఉదాహరణలు.

ఈ మధ్యనే తన అల్లుడి బదిలీగురించి, ఆ స్థానంలో రెండు నెలలయినా పూర్తిచేయని ఓ ఉపాధ్యాయుణ్ణి ఫుట్‌బాల్‌లా తన్నేశాడట! ప్రభుత్వం స్టేయిచ్చినా లెక్కచేయలేదట! అదేమని అడిగితే ఒత్తిళ్ళు.... బెదిరింపులు.... భీతావహం!

ఈ సంవత్సరం పాఠశాలల కిచ్చిన కంటింజెన్సీ నిధులలో 20 వేలదాకా కైంకర్యం చేయటంలో ఆయనది ప్రముఖ పాత్ర అని సమితి అంతటా చెప్పుకొంటున్నారు. ప్రింటింగు ఫారాల పద్దులో ఆ దుర్వినియోగం జరిగిందట! అందుకు వారనుసరించిన మార్గం అపూర్వమట! ప్రతి ఏకోపాధ్యాయపాఠశాలకు రు. 62/-లు, ఇద్దరుంటే రు. 130/-లు 5 తరగతులుంటే రు. 190/-లు, యు. పి. స్కూళ్ళకు రు 250/-లు ఫారాల పద్దుకింద మంజూరు చేశారట! కాని యధార్థంగా ఉపాధ్యాయులకు వీటి విలువలో నాల్గవ వంతుకూడా అందలేదట!

ఇకచూడండి వ్యూహం. ఆ నామమాత్ర ఫారాలను, వాటి రశీదులను ఉపాధ్యాయులకు ఇచ్చి బిల్లులుమాత్రం పాఠశాలల నుండి చేయించాడట! బదిలీల బెదిరింపులు, ఒత్తిళ్ళుతేవటం వలన ఉపాధ్యాయులు బిల్లులుచేయక తప్పలేదట! అవి మంజూరుకాగానే ప్రతి హెడ్మాష్టరువద్ద ఆ బిల్లు మొత్తాలను బ్యాంకువద్ద కాపలాకాచి కాబూలీవాలా లాగా వసూలుచేసు కున్నాడట!

ఇంత అబిల్లుల్లో ఒక్కొక్క టీచింగునోట్సువిలువ రు. 23 లు
ఒక్కొక్క ప్రోగ్రెస్‌కార్డు ధర రు. 0-75 లు!

—దీన్నిబట్టి మనం ఊహించు కోవచ్చు.... ఎంత పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందో!

విద్యాశాఖ వారు వెంటనే దీనిని సమగ్ర దర్యాప్తు జరిపి దుర్వినియోగాన్ని, దాన్ని కప్పివేసేందుకు సమితిలో సాగుతున్న భీతావహాన్ని నివారించాలని డిమాండ్ చేస్తున్నాం.

## సి. డి. చెల్లింపుకై గుంటూరుజిల్లా యు.టి.యఫ్. ప్రత్యక్షచర్య

### ఉపాధ్యాయుల అపూర్వ చైతన్యదీక్ష

"సి. డి. వెంటనే చెల్లించాలి!
హిందీ పండితుల జీతాలు వెంటనే ఇవ్వాలి!
అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి!
ఉపాధ్యాయ ఉద్యోగుల సమైక్యత వర్ధిల్లాలి!
రెడ్ టేపిజం నశించాలి!
లంచగొండితనం నశించాలి!
యు.టి.యఫ్. జిందాబాద్!"

—అపూర్వ క్రమశిక్షణతో జిల్లా నలుమూలలనుండి వచ్చిన 500 మంది ఉపాధ్యాయులు 5-4-78 న గుంటూరు యన్. జి. ఓ, హోంనుండి తమ కోర్కెల్ని ప్రతిధ్వనిస్తూ ఊరేగింపుగా వెళ్ళి జడ్ పి. ఆఫీసు యెదుట ప్రదర్శన సాగించారు. దానికి శ్రీ టి. అంజిరెడ్డి (జిల్లా ప్రధానకార్యదర్శి), శ్రీ యం. రాయన్న (అధ్యక్షుడు) శ్రీ మైనేని, శ్రీ యం. జె. మాణిక్యాలరావు (ఎం. ఎల్. సి.) గార్లు ఆధ్వర్యం వహించారు. ఉత్తేజకర నినాదాలతో జడ్. పి. ఆఫీసు మారుమ్రోగింది.

వెంటనే జడ్. పి. శక్రటరీ, ఎక్కౌంటెట్ ఆఫీసరు ప్రదర్శకులతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీ యం. జె యం. ప్రదర్శకుల కోర్కెల్ని వివరిస్తూ సమస్యల్ని వెంటనే పరిష్కరించకపోతే తీవ్రపరిణామాలకు దారితీయటం జరుగుతుందని హెచ్చరించారు. 9-2-78 సమన్వయ సమావేశంలో మేనేజిమెంటు అంగీకరించిన సి. డి. పూర్తి చెల్లింపు, హిందీ పండితుల జీతాలు, ప్లాన్‌పోస్టులవారి జీతాలు, పి. యఫ్. స్లిప్పులు, 1964, 70 పంచాయత్ ఎన్నికల ఎరండ్‌లీవు, హెడ్మాష్టర్ల పేనల్, ఇన్‌సర్వీసు టీచర్ల ప్రమోషన్, సెలక్షన్‌గ్రేడ్స్ ఫిక్సేషన్, తెలంగాణా టీచర్ల సర్వీసు రెగ్యులైజేషన్ మొదలైన హామీల్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు ఉపాధ్యాయుల ఓర్పును పరీక్షకుపెట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

పిదప జడ్. పి. శక్రటరీ ఉపాధ్యాయుల క్రమశిక్షణను, దీక్షను ప్రశంసిస్తూ వారికోర్కెల్ని అతిత్వరలో నెరవేర్చగలమని, మిగిలిన సి.డి. చెల్లింపు ఏప్రియల్ 10 లోపల జరుగగలదని, తాను ఛార్జితీసుకొని కొద్దిరోజులే అయిందనీ, సంఘం ఇచ్చిన నోటీసు లోని అంశాలన్నీ పరిశీలించానని చెప్పి తాను తీసుకొన్న చర్యల్ని వివరించారు.

తరువాత ఎకౌంట్ ఆఫీసర్ హిందీపండితుల జీతాలు మేనెల వరకు జనరల్‌ఫండ్స్‌నుండి ఇస్తామన్న లోగడ ఇచ్చిన ఆర్డర్ పాటిస్తామని, హెడ్మాష్టర్ల పేనల్ మ్యూచువల్ బదిలీలు కలెక్టర్ గారికి పంపేమని, మిగిలిన అన్నిఅంశాలు హామీల ప్రకారం అతి త్వరలో నెరవేరుస్తామని చెప్పేరు.

అంతట సంఘ ప్రతినిధులు హిందీ పండితుల జీతాల చెక్కులు ఈ సాయంత్రమే ఇవ్వాలని పట్టుబట్టేరు. కలెక్టర్‌గారిని సంప్రదించి ప్రొసీజర్ ప్రకారం ఆ కోర్కె నెరవేరుస్తామని, యల్.యఫ్ యి. వారి ఆటంకం అడ్డుగా వున్నదని చెప్పేరు.

పిదప ప్రదర్శన యల్.యఫ్. ఆఫీసుకు తరలింది. అక్కడ యల్.యఫ్. ఆఫీసరుగారు సంఘ ప్రతినిధులతో సంప్రదించి హిందీ పండితుల మార్చినెల జీతాలు వెంటనే ఇవ్వటానికి అంగీకరించి దానికి తగు చర్యలు తీసుకొన్నారు. పోష్టుల శాంక్షన్ హైదరాబాద్ నుండి వచ్చేవరకు జనరల్ ఫండ్స్ నుండి ఇప్పించటానికి తమ సానుకూలత తెల్పారు.

సాయంత్రం శ్రీ యం. రాయన్న అధ్యక్షతన యన్.జి.ఓ హోంలో జరిగిన సభలో ప్రదర్శననీ దాని ఫలితాల్ని సమీక్షిస్తూ కార్యకర్తలు తమ అభిప్రాయాల్ని తెల్పారు. త్యాగంతో .... దీక్షతో....సంఘటిత శక్తితో ఆత్మగౌరవాన్ని కాపాడుకొంటూ ఉద్యమం ముందుకు పోతున్నదని పలువురు వెల్లడించారు. పిదప శ్రీ మైనేని జిల్లాలో ఉపాధ్యాయవర్గం అపూర్వ చైతన్యం ప్రదర్శించిందని, వ్యక్తుల శక్తుల కలయికతో సమైక్యత సాధించిందని దాని నింకా ముందుకు తీసుకుపోవల్సిందిగా ఉద్బోధించారు.

★



# కాలటంవల్ల పడిన గాయాలు (BURNS)

శ్రీ యం. రామారావు, ప్రజావైద్యశాల
విజయవాడ-2.

గాయాలలో ఒకరకం కాలటంవల్ల ఏర్పడతాయనుకున్నాము. ఈ కాలటంలోకూడా (1) మంటలవల్ల కాలేవి (2) కరెంటువల్ల కాలేవి (3) వేడినీరులేక కాగేచమురువల్ల కాలేవి (4) రసాయనాల వల్ల కాలేవి వివిధంగా వున్నాయి. వీటిలో మొదటి రెండు కారణాల వల్ల కాలినప్పుడు 'Burns' అని చివరిరెండు కారణాలవల్ల కాలినప్పుడు 'Scalds' అని అంటారు.

తీవ్రతనుబట్టి యీ కాలటాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు.

(1) **Superficial Burns :** వీనిలో చర్మం పైపొరలు మాత్రమే దెబ్బతింటాయి. చర్మం ఎరుపెక్కటం, బొబ్బలు పొక్కటం ఉంటుంది. గాయం మచ్చలులేకుండా 2 వారాలలో మానిపోతుంది.

(2) **Partial Thickness Burns :** వీనిలో చర్మం పాక్షికంగా దెబ్బతింటుంది. అది మళ్ళీ పునరుద్ధరింపబడటానికి అవసరమైన Malpiquian వరుస కొంతవరకు మాత్రమే దెబ్బతింటుంది. మిగిలినదాని నుండి చర్మం మళ్ళీ పెరుగుతుంది.

(3) **Deep Burns :** వీనిలో చర్మం మొత్తంగా దెబ్బతింటుంది. కాలిన దగ్గర చర్మం పునరుద్ధరింపబడే అవకాశం లేదు. చర్మం పూర్తిగా కాలని దగ్గరినుండి చర్మం పెరుక్కుంటూవస్తుంది. అందువల్ల మచ్చలు ఏర్పడతాయి. అవి కుంచించుకుపోయి వికృతంగా కూడా తయారు కావచ్చు.

**కాలినచోట జరుగు మార్పులు :** ఇవి వేడితీవ్రతను బట్టి, వేడి తగిలిన కాలాన్నిబట్టి ఉంటాయి. ఈ మార్పులు కమిలి బొబ్బలెక్కటం దగ్గరినుండి బొమికవరకు మాడిపోవటం దాకా ఉంటాయి. కాలిన దగ్గర చిన్నచిన్న రక్తనాళాలు దెబ్బతినటం వలన, వ్యాకోచించటం వలన, ప్లాస్మా హెచ్చుగా బయటికి వస్తుంది. పుండు, దానిమీద చేరిన ప్లాస్మా, క్రిములు పెరగటానికి మంచి అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి కాలటంవల్ల ఏర్పడిన గాయాలు త్వరగా చీముపట్టే అవకాశం ఉంది.

చాలా సందర్భాలలో చర్మం ఎంత లోతువరకు కాలిందో చెప్పటం సాధ్యంగాదు. సూదితో గుచ్చినపుడు స్పర్శ తెలిస్తే, చర్మం పూర్తిగా కాలిపోలేదని, చర్మం మళ్ళీ పెరిగే అవకాశం ఉన్నదనీ చెప్పవచ్చు. స్పర్శ తెలియకపోతే చర్మంలో చాలా భాగంగాని, పూర్తిగాకాని కాలిపోయిందనీ, అక్కడ చర్మం పెరిగే అవకాశం లేదని గ్రహించి వేరే దగ్గర చర్మం తీసి కాలిన దగ్గర వేయవలసి వస్తుంది.

**శరీరంలోవచ్చే మార్పులు :** శరీరంలో ఒకభాగమే కాలినా దాని ప్రభావం శరీరం మొత్తంమీద పడుతుంది. కాలినవ్యక్తి వ్యాధిగ్రస్తుడుగా కనిపిస్తాడు. ఎంతభాగం కాలింది – అన్నదానిమీద ఎంతలోతు కాలినది– అన్నదానిమీద శరీరంలో వచ్చే ఈ మార్పులు ఆధారపడి ఉంటాయి. కాలిన ప్రాంతంలో శరీరంలోని ద్రవ పదార్థం హెచ్చుగా బయటికి వస్తుంది. ఈ పరిస్థితి 48 గంటల వరకు కొనసాగుతుంది. దీనివల్ల బి. పి. తగ్గటం, షాక్ రావటం జరుగుతుంది. మూత్రం సరిగా ఉత్పత్తికాదు. తర్వాత శరీరంలోని రక్తం క్షీణిస్తుంది. దానివల్ల గాయం మానటం ఆలస్యమవుతుంది. గాయాలకు చీము పట్టటం పెద్దసమస్య. ఎక్కువమంది చనిపోవడానికి కారణం కూడా ఇదే. గాయం మరింతలోతు కావటానికి, మానటం మరింత ఆలస్యం గావటానికి చీము పట్టటం ముఖ్యకారణం.

కాలిన భాగంలో స్రవించే ద్రవంద్వారా, మూత్రం ద్వారా హెచ్చుమొత్తంలో మాంసకృత్తులు నష్టపోవటం జరుగుతుంది. దీనివల్ల శరీరంలో వ్యాధి నిరోధకశక్తి సన్నగిల్లి గాయం మానటం మరింత ఆలస్యమవుతుంది. — (సశేషం) ★

# ప్రబోధము

—దేశంశెట్టి సుబ్బారావు.

ఉపాధ్యాయ సోదరా
విజయ శంఖమూదరా
ఐక్యతతో నిలిచి నీదు
సంఘశక్తి చాటరా ॥ఉపా॥
అవినీతి పెరిగెరా
హక్కుల హరియించెరా
న్యాయమైన కోర్కెలకై
నడుముకట్టి పోరరా ॥ఉపా॥
వెనుకచూపు మానరా
ముందుచూపు చూడరా
స్వార్థపరుల నెదిరించగ
ముందు వెనుక లేదురా ॥ఉపా॥
ముళ్ళబాట విడువరా
పూలబాట నడువరా
అమరజీవి చెన్నుపాటి
చూపె వెలుగు బాటరా ॥ఉపా॥
దోపిడీ వ్యవస్థరా
రూపుమాప లెమ్మురా
అడ్డుగోడ లెన్నున్నను
అధిగమించి సాగరా ॥ఉపా॥
హక్కులకై పోరరా
బాధ్యత గుర్తించరా
నిరతము నీకండదండ
యు. టి. యఫ్. నిలుచురా ॥ఉపా॥



# నియమ నిబంధనలు

## ప్రొబేషన్

**శ్రీ బి. నరసింహారావు**

ఉద్యోగంలోచేరిన తర్వాత ప్రతిఉద్యోగి కొంతకాలంతాత్కాలిక ప్రాతిపదిక మీద ఉద్యోగంలో వుంచబడతాడు. ఈ కాలాన్ని 'ప్రొబేషన్ పీరియడ్' అంటారు. ఈ కాలంలో ఉద్యోగి తాను ఉద్యోగానికి తగిన వానినిగా నిరూపించుకోవాల్సివుంటుంది. ప్రొబేషన్ కాలం సంతృప్తికరంగా పూర్తిచేసిన ఉద్యోగి ఉద్యోగంలో పూర్తిసభ్యుడిగా నియమింపబడేందుకు అర్హత సంపాదిస్తాడు.

ఈ ప్రొబేషన్‌కు సంబంధించిన నియమాలు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 23 నుండి 32వరకు ఉన్న వాటిలో ఉన్నాయి.

**ప్రొబేషన్ ప్రారంభం :** ఉద్యోగి రెండు సంవత్సరాలు ప్రొబేషన్‌లో ఉండాల్సి ఉంటుంది. సాధారణంగా ఉద్యోగికి ఉద్యోగంలో చేరినప్పటి నుండి ప్రొబేషన్ ప్రారంభమౌతుంది. తాత్కాలికంగాగాని, ఎమర్జెన్సీగాగాని నియమింపబడిన ఉద్యోగులు తర్వాత మామూలు (రెగ్యులర్) నియామకం పొందినప్పుడు వారు ఉద్యోగంలో చేరినప్పటి నుండిగాని లేక నిర్ణయింపబడిన తర్వాత తేదీ నుండిగాని వారి ప్రొబేషన్ మొదలైనట్టు నియామకాధికారి నిర్ణయింపవచ్చు.

**ప్రొబేషన్ కాలం :** ఈ క్రిందివి ప్రొబేషన్ కాలం లోకి వస్తాయి.

1. నియమింపబడిన ఉద్యోగంలో ఉద్యోగి పనిచేసినకాలం.
2. ఉద్యోగి తాత్కాలికంగా ప్రమోషన్‌పొంది అందులో పనిచేసిన కాలం.
3. బదిలీమీద ఇంకో ఉద్యోగంలో తాత్కాలికంగా పనిచేసి వుంటే ఆ పనిచేసిన కాలం.

క్యాజువల్ లీవుతప్ప ఇతర రకాల శలవులు ప్రొబేషన్ కాలంలోకిరావు.

**ప్రొబేషన్ రద్దు :** ఉద్యోగంలో వేకెన్సీ లేనప్పుడు నియామకాధికారి ప్రొబేషన్ రద్దుచేసి ఉద్యోగిని తొలగింపవచ్చు. ఇట్లు ఖాళీలులేక ఉద్యోగంనుండి తొలగింపబడిన ఉద్యోగులు ఖాళీలు ఏర్పడినప్పుడు తొలగించేనాటికి వారికున్న సీనియారిటీ ప్రకారం తిరిగి ఉద్యోగాలలో చేర్చుకోబడతారు.

**ప్రొబేషన్ పొడిగింపు :** ఈ క్రింది పరిస్థితులలో ప్రొబేషన్ పొడిగింపబడుతుంది.

1. కొన్ని ప్రత్యేక అర్హత (స్పెషల్ క్వాలిఫికేషన్)ల సంపాదనకాని, కొన్ని ప్రత్యేక పరీక్ష (స్పెషల్ టెస్ట్)ల ఉత్తీర్ణత కాని కొన్ని సందర్భాలలో ప్రొబేషన్‌పూర్తికి అర్హతగా నిర్ణయింపబడవచ్చు. అలాంటి సందర్భాలలో ఉద్యోగి ఆ ప్రత్యేక అర్హతలు సంపాదించలేకపోయినా, పరీక్షలలో ఉత్తీర్ణుడు కాలేకపోయినా అతని ప్రొబేషన్ పూర్తికాదు. అప్పుడు నియామకాధికారి ఉద్యోగి ప్రొబేషన్ పొడిగించవచ్చు.

2. ఉద్యోగి పరీక్షలకు కూర్చొని ఉండవచ్చు. కాని ప్రొబేషన్ కాలం పూర్తి అయ్యేనాటికి ఆ పరీక్షల ఫలితాలు ప్రకటింపబడకపోవచ్చు. అలాంటి సందర్భంలో పరీక్షల ఫలితాలు ప్రకటింపబడే వరకు ఉద్యోగి ప్రొబేషన్‌లో ఉన్నట్లు లెక్కింపబడతాడు.

3. ప్రొబేషన్ కాలంలో ఉద్యోగి ఉద్యోగ నిర్వహణ సంతృప్తికరంగా లేనట్లు నియామకాధికారి భావించవచ్చు. ఉద్యోగి పనిని ఇంకొంత కాలం పరీక్షించదలచవచ్చు. తన సామర్థ్యం నిరూపించుకొనేందుకు ఉద్యోగికి ఇంకొంతకాలం ఈయాలనుకోవచ్చు. అలాటప్పుడు కూడ ఉద్యోగి ప్రొబేషన్ పొడిగింపబడవచ్చు.

ఐతే ప్రొబేషన్ పొడిగింపు సంవత్సరకాలానికి మించరాదు.

### ప్రొబేషన్ ముగింపు (టెర్మినేషన్ ఆఫ్ ప్రొబేషన్)

ప్రొబేషన్ కాలంలో ఉద్యోగి ఉద్యోగనిర్వహణ చాలా అసంతృప్తికరంగా ఉన్నప్పుడు నియామకాధికారి ప్రొబేషన్ కాలం పూర్తి అయ్యేలోపు ఎప్పుడైనా ఉద్యోగి ప్రొబేషన్ ముగింపు (టెర్మినేట్) చేసి అతనిని ఉద్యోగంనుండి తొలగించవచ్చు.

ప్రొబేషన్ కాలంలోను, ముగింపు కాలంలోను అవసరమైన ప్రత్యేక అర్హతలు సంపాదించలేక పోయినా, ప్రత్యేక పరీక్షలలో ఉత్తీర్ణుడు కాలేకపోయినా కూడ ఉద్యోగి ప్రొబేషన్ ముగింపుచేసి నియామకాధికారి అతనిని ఉద్యోగంనుండి తొలగించవచ్చు.

ఐతే పరీక్షలలో ఉత్తీర్ణుడు కాలేకపోవడం వల్ల ప్రత్యేక అర్హతలు సంపాదించలేకపోవడంవల్ల ఉద్యోగి ప్రొబేషన్ రద్దు చేయడంలో నియమకాధికారి స్వీయనిర్ణయం (డిస్‌క్రిషన్)కు అవకాశంలేదు. కాని ఉద్యోగి ఉద్యోగ నిర్వహణ అసంతృప్తికరంగా వుందని అతని ప్రొబేషన్ ముగింపు చేసేప్పుడు నియామకాధికారి లేక శాఖాధిపతి (హెడ్ ఆఫ్ది డిపార్ట్‌మెంట్) చాలాజాగ్రత్తగా వ్యవహరించాల్సివుంటుంది. ఉద్యోగిపై తనకున్న దురభిప్రాయం వల్ల లేక ఉద్యోగిపట్ల తనకు కలిగిన కోపంవల్ల నియామకాధికారి ఉద్యోగికి వ్యతిరేకమైన నిర్ణయం తీసికోగూడదు.

ఉద్యోగ నిర్వహణలో సామర్థ్యాన్నేకాక ఉద్యోగి దృక్పథాన్ని, శీలాన్ని, శక్తిని, అభిరుచుల్ని, అభీష్టాల్ని, ఇతరులతో అతను వ్యవహరించే విధానాన్ని ఇలాంటి అనేక వ్యక్తిగత లక్షణాల్ని, విలువల్ని పరిగణనలోనికి తీసికొని పై అధికారి ఉద్యోగి విషయంలో ఒక నిర్ణయానికి రావల్సిఉంటుంది.

ఈవిధంగా పరీక్షలలో ఉత్తీర్ణుడు కాకపోవడం వల్లగాని, ఉద్యోగ నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడంవల్లగాని ప్రొబేషన్ ముగింపుచేసి ఉద్యోగిని ఉద్యోగం నుండి తొలగించడం శిక్ష క్రిందికి రాదు. అందువల్ల ఇలా ఉద్యోగం నుండి తొలగించేందుకు శిక్ష విధించేందుకు అనుసరించాల్సిన విచారణ జరపడం మొదలైన విధానం అనుసరించాల్సిన అవసరం లేదు.

**అప్పీల్ :** ప్రొబేషన్ ముగింపు (టెర్మినేషన్ అఫ్ ప్రొబేషన్)కు వ్యతిరేకంగా అప్పీలుచేసికొనే అవకాశం ఉద్యోగికి ఉన్నది. ఉద్యోగి తన అప్పీల్‌ను ప్రొబేషన్ ముగింపుచేసిన అధికారికన్న పై అధికారికి ముగింపు ఉత్తరువు పొందిన మూడు నెలలలోగా సమర్పించాలి. పైఅధికారి ఉద్యోగి అప్పీలుపై తగిన నిర్ణయం తీసికుంటాడు.

ఉద్యోగి ప్రొబేషన్ ముగింపును రద్దుచేసి అతనిని తిరిగి ఉద్యోగంలో చేర్చుకున్నప్పుడు పైఅధికారి ఉద్యోగి ఉద్యోగం నుండి తొలగించబడడానికి, తిరిగి ఉద్యోగంలో చేర్చుకోబడటానికి మధ్యఉన్న కాలంపైకూడ తగు నిర్ణయం తీసికొంటాడు.

ఆ కాలాన్ని డ్యూటీగా నిర్ణయించి ఉద్యోగికి ఆ కాలానికి పూర్తి జీతం ఇయ్యవచ్చు.

లేదా

ఆ కాలంపై ఇతర రకమైన నిర్ణయం తీసికోవచ్చు.

**ప్రొబేషన్ ప్రకటన :** ఉద్యోగనిర్వహణసంతృప్తికరంగా వున్నప్పుడు, ప్రొబేషన్ కాలం పూర్తికాగానే నియామకాధికారి ఉద్యోగి ప్రొబేషన్‌కాలం సంతృప్తికరంగా పూర్తిచేసినట్లు ఉత్తర్వులిస్తాడు. ఉద్యోగి ప్రొబేషన్ కాలం పూర్తియైన ఎనిమిది వారాల లోపల ఇలాంటి ఉత్తర్వు లివ్వబడాలి.

ఉద్యోగి లోపాలనుగాని, పొరపాట్లనుగాని గమనించినపుడు ప్రొబేషన్ పూర్తికి చాలాముందుగానే వాటిని అధికారి ఉద్యోగికి తెలియజేయాలి. ఆ లోపాలను లేక పొరపాట్లను సరిదిద్దుకొనేందుకు తగిన అవకాశం ఉద్యోగికివ్వాలి.

ఉద్యోగి సంతృప్తికరంగా ప్రొబేషన్ పూర్తిచేసినట్లు ప్రకటించటాన్ని నియామకాధికారి నిరవధికంగా వాయిదావేసే వీలులేదు.

ప్రొబేషన్ కాలం పూర్తియైన సంవత్సరంలోపల ఉద్యోగి ప్రొబేషన్ సంతృప్తికరంగా పూర్తిచేసినట్లు నియామకాధికారి ఉత్తర్వు లివ్వకపోతే, ఆ ప్రొబేషన్ కాలం పూర్తియైన దగ్గర నుండి ఉద్యోగి సంతృప్తికరంగా ప్రొబేషన్ పూర్తిచేసినట్లుగానే లెక్కించబడతాడు. (25.డి) అయితే అలా లెక్కింపబడటానికి ప్రొబేషన్ పూర్తికి నిర్దేసింపబడిన పరీక్షలన్ని ఉద్యోగి ఉత్తీర్ణుడై ఉండాలి.

## తెలంగాణా ఉద్యోగులకు ప్రత్యేక నియమం:

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వం హైదరాబాద్ రాష్ట్రంలో ఉద్యోగులుగా ఉండి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ఒక ప్రత్యేక నియమం (23ఎ)ఏర్పాటు చేయబడింది. 1956 రాష్ట్ర పునర్నిర్మాణ చట్టం (స్టేట్ రీఆర్గనైజేషన్‌యాక్టు) ప్రకారం పూర్వపు హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగులకు అప్పటిస్కేళ్ళలో ఒక పైస్కేలుకు ప్రమోషన్ పొందే అర్హత ఉంది. అలా ప్రమోషన్ పొందిన పూర్వపు హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగులు అప్పటి నియమాల ప్రకారం ప్రొబేషన్ పూర్తిచేయాలి.

**ధృవీకరణ :** సంతృప్తికరంగా ప్రొబేషన్ పూర్తిచేసిన


ఫోన్ : 22315

# శ్రీ సూర్య ఆయుర్వేద నిలయం (బ్రాంచి)

అరండల్ పేట 4 వ లైను, గుంటూరు

విజయబ్యాంకు ఎదుట శ్రీ టి.వి జి. క్రిష్ణమూర్తి, యం.ఎ.
లెక్చరర్ హిందూ కాలేజి వారి యింటిలో

**ఆయుర్వేదములో గొప్ప పరిశోధన**

నేటి వరకు అసాధ్యముగ నున్న అనేక కఠిన వ్యాధులను సులభముగ తగ్గించు అనేక దివ్యౌషధములు లభించును

సమస్త చర్మవ్యాధులకు మల్లవ్యాధికి ఆపరేషన్‌తో పనిలేకుండా ప్రత్యేకముగా మందులు యివ్వబడును.

తేలు మందు, పాము మందు కూడ లభించును.

మీ ఆరోగ్యము కోసం ఒకసారి దయచేయండి

ఉద్యోగి ఉద్యోగంలో ధృవీకరింపబడేందుకు అర్హత పొందుతాడు. అంటే అతను ఉద్యోగంలో పూర్తి సభ్యునిగా చేర్చుకోబడేందుకు అర్హత వస్తుందన్నమాట.

ప్రొబేషన్ సంతృప్తికరంగా పూర్తిచేసేవరకు ఉద్యోగి ఉద్యోగంలో తాత్కాలిక ప్రాతిపదికమీద ఉంటున్నట్లుగానే లెక్కింపబడతాడు. ఆ తర్వాత అతను శాశ్వతప్రాతిపదికమీద ఉద్యోగంలో ధృవీకరింపబడతాడు.

ఐతే ఇలా ధృవీకరణ జరిగేందుకు ఉద్యోగంలో శాశ్వతమైన ఖాళీ ఉండాలి. ఉద్యోగి ప్రొబేషన్ పూర్తిచేసి కొంతకాలానికి ఉద్యోగంలో శాశ్వతమైన ఖాళీ ఏర్పడినట్లయితే అఖాళీ ఏర్పడినప్పటి నుండి ఉద్యోగి ఉద్యోగంలో ధృవీకరింపబడతాడు. ఉద్యోగి ప్రొబేషన్ పూర్తిచేసిన నాటికే ఉద్యోగంలో శాశ్వతమైన ఖాళీవుండి, ధృవీకరణ ఉత్తరువు తర్వాత కొంతకాలానికి ఈయబడ్డప్పుడు ఉద్యోగి ధృవీకరణ అంతకుముందుకాలం నుండి చేయబడ్డట్లు నిర్ణయించబడవచ్చు.

ప్రొబేషన్ పూర్తిచేసిన ఉద్యోగులు ఎక్కువ మంది వుండి, శాశ్వతమైన ఖాళీలు తక్కువ ఉన్నప్పుడు ప్రొబేషన్ పూర్తిచేసిన ఉద్యోగుల సీనియారిటీ ప్రకారం వారి ఉద్యోగాల్ని ధృవీకరిస్తారు.

## తెనాలితాలూకాలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు అపూర్వ ఆదరణ

గుంటూరుజిల్లా తెనాలితాలూకాలోని హైస్కూళ్ళలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యకర్తలకు అపూర్వమైన ఆదరణ లభించినది.

శ్రీ వై. యల్. నారాయణ (జిల్లా యు. టి. యఫ్. కార్యదర్శి)గారి నాయకత్వాన శ్రీయుతులు కె. నారాయణరావు (అమృతలూరు సమితి యు.టి.యఫ్. ప్రధాన కార్యదర్శి) యి. అప్పారావు (ఈమని సమితి యు.టి.యఫ్. ప్రధానకార్యదర్శి) టి. గురుమూర్తి (తెనాలి సమితి యు.టి.యఫ్. ప్రధాన కార్యదర్శి) యస్. వెంకటేశ్వరరావు యం. వి. సీతారామయ్య (యు. టి. యఫ్. కార్యకర్తలు) గారలు ఒకదళంగా 20-3-78నుండి 1-4-78 వరకు తెనాలి తాలూకాలోని హైస్కూళ్ల టూర్ చేయుట జరిగింది.

ఈ టూర్‌లో వారు జిల్లా పరిషత్, డి.యి.ఓ, సమితి ఆఫీసులలో జరుగు జాప్యములను, అవకతవకలను వివరించి సమస్యా పరిష్కారమునకు యు. టి. యఫ్. చేస్తున్న కృషిని 13-2-78 ధర్నా తరువాత పరిష్కరింపబడిన సమస్యలు, ఆ రోజు వాగ్దానము చేసి ఇంతవరకు పరిష్కరింపబడని సమస్యలు (ముఖ్యముగా సి. డి) ఎలా సాధించవలసినది తేటపరచి ఉపాధ్యాయులందరు ఐకమత్యముతో పోరాడగలిగినప్పుడే సమస్యలు పరిష్కారమగునని అందుకుఅంతాసిద్ధము కావలెననియు వివరించిరి. చెన్నుపాటి భవననిధికి, జనరల్‌ఫండ్‌కు విరివిగా విరాళములు యివ్వవలసినదిగా విజ్ఞప్తి చేసిరి.

ప్రతి హైస్కూలులోను కార్యకర్తలను ఎంతో ఆదరముతో ఆహ్వానించి సమస్యా పరిష్కారమునకు యు. టి. యఫ్ చేస్తున్న కృషిని ప్రశంసించిరి. సంఘం ఏ కార్యక్రమం ఇచ్చినా పాల్గొని జయప్రదము చేస్తామని హామీనిచ్చిరి.

ప్రతి హైస్కూలులోను 116 రూపాయలకు తగ్గకుండా కొన్ని పెద్ద హైస్కూళ్ళలో 350 రూ. వరకూ జనరల్ ఫండుకు విరాళములొసగి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను ఎంతో ఆదరించిరి. ఈ టూర్‌లో 28 హైస్కూళ్ళలో దాదాపు రూ. 4000 విరాళాలు ప్రకటించుట జరిగింది. ఇంకా మిగిలిన హైస్కూళ్ళలో కూడా రూ. 1000 వరకువచ్చు అవకాశము కలదు.

28-3-78 న తెనాలిలో జరిగిన విస్తృత కార్యవర్గ సమావేశమునకు సుమారు 60 మంది హాజరై 5-4-78 న గుంటూరుజిల్లా పరిషత్ ఆఫీసుముందు జరుగు ప్రదర్శనలో ఎక్కువ సంఖ్యలో పాల్గొందుమని నిర్ణయము తీసికొనిరి.

ఆ యా హైస్కూళ్ళలో అన్నివిధాల ఆదరించిన ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు జిల్లా యు.టి.యఫ్. తరపు శ్రీ వై. ఎల్. నారాయణ (కార్యదర్శి) అభినందనలు తెలియజేస్తున్నారు.



## జీవిత చందాదారులు

207. శ్రీ ఎ. నరసింహమూర్తి, కేశనపల్లి, తూ. గో. జిల్లా.
208. శ్రీ జి. గోకుల్‌చంద్, ఎం. ఎ. బి. యి. డి, పెరవలి, గుంటూరుజిల్లా
209. శ్రీ పి. ఆర్. చక్రవర్తి, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా

**డైరెక్టరుగారితో రాయబారాలు :** విజయవాడ పట్టణ యు.టి.యఫ్. శాఖ అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీ యస్. వి. రామారావు, శ్రీ ఆర్. సుబ్బయ్యగార్లు శ్రీ పి. సత్యనారాయణమూర్తి, శ్రీ వి. భాస్కరరావుగార్లు 2-4-78 తేదీన గుంటూరులో సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గారితో శ్రీయుతులు యం. జె. మాణిక్యారావు (యం.యల్.సి.) శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు (యం. యల్.సి.) గార్ల సమక్షంలో హిందూ హైస్కూళ్ళ సమస్యలపై రిప్రజెంట్ చేయటం జరిగింది.

అప్పుడు అక్కడేవున్న కృష్ణాజిల్లా డి.యి.ఒ.తో డైరెక్టర్ గారు 17-2-78 న మేనేజిమెంటుకు యాక్షన్‌కమిటీకి మధ్య జరిగిన సంప్రదింపుల్ని, హామీల్ని అమలుపరచ వలసిందిగాను, కక్షాపర్యగా మేనేజమెంట్ మినహాయించిన జీతాన్ని ఇప్పించ వలసిందిగాను చెప్పడం జరిగింది.

**పెద్దాపురం సమితి :** 22-3-78 న బి. డి. ఓ. గారి ఆధ్వర్యాన సంఘ ప్రతినిధులతో సమన్వయ సమావేశం జరిగింది. సంఘం సమర్పించిన 31 అంశాలపై చర్చలు జరిగాయి. బి.డి.ఓ. ఒక్కొక్క అంశముపై సమాధానాలుచెప్పి సాధ్యమైనంత త్వరలో వాటిని పరిష్కరిస్తామన్నారు. అధికారుల తరపున బి.డి.ఓ, ఇ.ఓ. (విద్య) డి.ఐ.గార్లు పాల్గొన్నారు. సంఘం తరపున జిల్లా సంఘాధ్యక్షులు శ్రీ పి. బి. ముత్తారావు, సర్వశ్రీ వి. వ్యాసమూర్తి, కె. దేవిడ్‌రాజు, డి. త్రిమూర్తులు, వి. ప్రకాశరావు, ఎం. ప్రభాకరరావు, ఎ. సూర్యారావుగార్లు పాల్గొన్నారు.

సీరియల్

# అభినవ నీతిచంద్రిక

## (బ్రెయిన్‌వాష్)

— మైనేని వెంకటరత్నం.

ఆ రోజు ఆదివారం కావటం వలన చాలామంది వచ్చారు చైతన్య సదన్‌కి.

పిచ్చాపాటి మాట్లాడుకొంటూ క్రమంగా చదువుల మీదికి తిరిగింది వాళ్ళ సంభాషణ.

'ఏమిటో యీ చదువులు .... కూటికీ గుడ్డకీ రావు!' అన్నాడు లోకయ్య.

'అసలు పిల్లలు చదివితేగా.... ! ఈ నాన్ డిటెన్షన్ స్కీము ఎందుకు ప్రవేశ పెట్టారోగాని ఒక్కడు పుస్తకం ముట్టుకొంటే ఒట్టు ! ' — నిస్పృహ వెల్లడించాడు శాస్త్రి.

"బండెడు పుస్తకాలు.... పనికిమాలిన పాఠాలు.... మళ్ళీ క్లాసుకి ఎనభై తొంభై మంది....ఏఆకర్షణ ఉన్నదని చదువుతారు.... ఉద్యోగాలు వస్తాయనా....ఉజ్జ్వల భవిష్యత్తు ఉంటుందనా !" — విమర్శలోకి దిగేడు జేమ్స్.

"మనదేం పోయిందీ....బెల్లూ....బిల్లూ !" తనవిట్టుకు తానే నవ్వేశాడు చౌదరి.

"అసలీ చదువుకీ జీవితానికీ సంబంధమే లేదు.... అందుకనే విద్యమీద పిల్లలకంత నిరాసక్తి!" అన్నది శారద....వాళ్ళ వ్యాఖ్యానాలమధ్య జోక్యం కల్పించుకొని.

ఆమె అక్కడి జూనియర్ కాలేజీలో సైన్స్ లెక్చరర్.

ప్రశ్నార్థకంగాచూశారు అంతా ఆమెవైపు....ఓ ఆకర్షణకలిగి.

"నిన్న సైన్స్ ప్రాక్టికల్ క్లాసులికి పదిమంది ఎగనాం పెట్టేరు. అడిగితే "సారీ మేడమ్! ఇంట్లో బియ్యం లేకపోతే చౌక డిపోదగ్గర రోజంతా నిలబడాల్సి వచ్చింది!" అని ఒకడూ....

"ఇంటర్ ఇంగ్లీషు పుస్తకం వచ్చిందంటే మళ్ళీ దొరకదని దాని వేటకు వెళ్ళేన"ని యింకొకడూ.

'మా అమ్మ ప్రసవించలేక చచ్చిపోతేరాలేద'ని మరో అమ్మాయి.

'జేమ్స్‌బాండ్ సినిమావస్తే చూట్టానికి వెళ్ళేను' అంటూ ఓ రాలుగాయీ....

—ఇలా వచ్చినయ్ సంజాయిషీలు.

వాళ్ళమాటలు వింటుంటే యాక్షన్ తీసుకోబుద్ధిగాలేదు నాకు. వాళ్ళ పరిస్థితులే అలాంటివి....వాటిని చక్కదిద్దాలిగాని తప్పంతా పిల్లలదే అంటే....నేను ఒప్పుకోను ! అన్నది శారద తేల్చిచెప్తూ.

దాన్ని అందుకొన్నాడు ఆచారి. అతను మంచిమాటకారి.

'మొన్న మా స్కూల్లో ఏంజరిగిందో తెలుసా?' ఓసస్పెన్స్ సృష్టించి అన్నాడు.

'ఏం జరిగింది....ఏం జరిగింది ?' అందరిలో తహ తహ.

ముక్కుపొడుంపీల్చి చెప్పటం మొదలెట్టేడు ఆచారి .... ఇన్స్పిరేషన్ తెచ్చుకొంటూ.

'ఆరోజు మా స్కూల్లో ఇన్‌స్పెక్షన్.

విటమిన్లపాఠం చక్కగా ప్రిపేరయి క్లాసుకి వెళ్ళాను.

పిల్లల్ని సావధానుల్ని చెయ్యాలిగా మరి.

'ఇవ్వాళ అన్నంలో ఏం వేసుకు తిన్నావ్'? అడిగేను ఓ టక్కపీచు కుర్రాణ్ణి.

'గొడ్డు కారం!'

'నువ్వమ్మా?'

'పుల్లనీళ్ళు!'

'నువ్వురా శర్మా?'

'ఆవకాయ పచ్చడి!'

'అప్పమ్మా నువ్వో?'

'అప్పడాలు!'

'ఏసోబూ....నువ్వురా?'

'అసలన్నమే తినలేదండీ!'

— అలా వచ్చాయి సమాధానాలు.

వెధవలు......ఆకు కూరలు......పళ్ళు....గుడ్లు.....మాంసం తిన్నామని ఒక్కళ్ళూ చెప్పలేదు.

మరి విటమిన్ల పాఠం ఎలా ప్రారంభించేట్టు ?

"పోనీ ఏం తాగేవ్ ?" మళ్ళీ అడిగేను ఇంకొకణ్ణి.... అటునుంచి నరుక్కొద్దామని.

"గంజి నీళ్ళు !"

"నువ్వూ ?"

"మంచినీళ్ళు !"

"నువ్వురా ?"

"మజ్జిగ నీళ్ళు !"

—శోష వచ్చింది ఆ జవాబులు వినేసరికి నాకు.

నీళ్ళు....నీళ్ళు....నీళ్ళు !

"పాలు అనే పదార్థమే తెలీవల్లే ఉంది వాళ్ళకి"

విసుగుపుట్టి ఇక నేనే చెప్పటం మొదలెట్టేను....

"మనం రోజూ విటమిన్లు ఉండే అన్ని ఆహార పదార్థాలు తినాలి. పాలు తాగాలి. పళ్ళు తినాలి. గొడ్డుకారాలూ....పుల్లనీళ్ళూ తాగితే జబ్బులొస్తాయి. అందుకనే మీరంతా పీనుగుల్లా తయారయ్యారు" అని ఉపోద్ఘాతం చెప్పి పాఠం వివరించాను.

ఇంతకీ ఇనస్పెక్టర్‌గారి రిమార్కేమిటో తెలుసా ?

'అసంతృప్తికరం !'

అంత తంటాలుపడినా....అసంతృప్తికరమేనట !

పిల్లల జవాబుల్ని ఆ తర్వాత తీరిగ్గా ఆలోచించాను.

ఆ పిల్లలు చెప్పింది నిజం !

అది వాళ్ళ జీవితానుభవం !

అర్థాకలితో వచ్చే ఆ పిల్లలకి పాఠాలెలా బుర్ర కెక్కుతాయి.... 'మీరే చెప్పండి'! అంటూ తన అనుభవాన్ని వివరించాడు ఆచారి.

రసపట్టులో పడిన ఆ సంభాషణని అందుకొన్నాడులోకయ్య.

'నేనూ చెప్పేను రోగజీవుల పాఠం.... డి.యి.ఓ. ముందు.'

'రోగాలెందుకు వస్తాయి?' అడిగేను ఓ భావి పౌరుణ్ణి.

'తిండి దొరక్క!' ఠక్కున జవాబు చెప్పేసు వాడు.

'ఓరి వెధవా ! ' అనుకొంటూ మరొకణ్ణి ప్రశ్నించాను.

'తిన్నదరక్క ! ' ఆటంబాంబులా పేల్చేసువాడు.

అదిరిపడ్డాను ఆ జవాబుకి.

నాపని ఎలా ఉన్నా మా డి. యి. ఓ. మాత్రం తారాజువ్వలా

లేచాడు .... ముఖం కందగడ్డ జేసుకొని.

ఆయన ప్రొద్దున తిన్న కోడిమాంసం అరక్క అప్పుడే అజీర్ణమాత్రలు వేసుకువచ్చాట్ట క్లాసుకి .... ఆ సంగతి ఆ తర్వాత తెలిసింది.

'ఇదా నువ్వు నేర్పేది?' అంటూ నిప్పుతొక్కిన వాడిలా లేచాడు నామీదికి.

చడా మడా రాశాడు రిమార్కులు.

దాని పరిణామం నా ఇంక్రిమెంట్ కట్! ఇదీ నాదుస్థితి! —— అన్నాడు లోకయ్య ఏడవలేక నవ్వుతూ.

విష్ణుశర్మ వాళ్ళ సంభాషణలో జోక్యం కలుగజేసుకొని ముగింపు మాటలు చెప్పేడు.

'ఈ వ్యవస్థ ఉన్నదే.... ఎవర్నీ సాఫీగా బ్రతకనీయదు.
పనిచేసుకొనే శక్తి ఉంటుంది.... పని దొరకదు
చదువుకోవాలని ఉంటుంది.... దాన్ని సాగనీయదు
చేతిలో డిగ్రీ ఉంటుంది.... ఉద్యోగం దొరకదు
అంగట్లో అన్నీ ఉంటాయి.... అల్లుళ్ళ నోళ్ళల్లో మాత్రం అంతా శనే?
ఇలా జీవితంలో అన్నీ వైరుధ్యాలే.... ఎదురుదెబ్బలే!
తిండి దొరకని వాళ్ళు కొందరు?
తిన్నదరగనివాళ్ళు కొందరు!
ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థకు ప్రతిబింబాలు వీళ్ళు
దాని పరిధి దాటి విద్యా.... వైద్యం.... వ్యాపారం.... సభ్యతా.... సంస్కృతీ.... ఏదీ ఉండదు.
ఈ విషవలయాన్ని ఎదిరించి పోరాడందే మనకు ముక్తిలేదు
పీడితుల బాణాలన్నీ అటు ఎక్కుపెట్టాలి.
అందుకే మధ్యతరగతి ఉద్యమాలు
సంఘటిత శక్తితో గూడిన మహోద్యమాలు:

——అంటూ దివ్యోపదేశం చేసి ఆరోజు సభ చాలించాడు విష్ణుశర్మ. (సశేషం)

# (ఆ)కలి కాలం!

——అడిగోపుల వెంకటరత్నం

రాయల కాలంలో రోడ్లపై
రత్నాలు రాసులు పోసుకొని అమ్ముతూ
తిండి తిప్పా కొరతలేక
తిన్నది అరగక తిరిగే కాలం!
——అది చారిత్రకం.
అన్నమో రామచంద్రా అనకుండానే
అన్నీ వాకిట్లో కొచ్చి వాలే శ్రీరాముని కాలం!
——అది పౌరాణికం.
ప్రజలకు అవసరమైనప్పుడల్లా
ఆంపట్ అనగానే అద్భుత సౌధాలు, ఆహారపదార్థాలు
ముందుకొచ్చి ఆగే మాంత్రిక రాజుల కాలం!
——అది జానపదం.
రోడ్డుప్రక్కన పెంటకుప్పల మధ్యన
తిండిలేక నిన్న చచ్చిన శవం

## పత్రిక క్యాంపెయిన్ల ఫలితాలు

| జిల్లా | స్పెషల్ క్యాంపెయిన్ కోటా | స్పెషల్ క్యాంపెయిన్ పూర్తి చేసింది | జనరల్ క్యాంపెయిన్ కోటా | జనరల్ క్యాంపెయిన్ పూర్తి చేసింది | జిల్లావారీ జీవిత చందాలు |
|---|---|---|---|---|---|
| విశాఖ | 50 | 9 | 25 | 41 | 1 |
| తూ.గో. | 300 | 190 | 600 | 492 | 44 |
| ప. గో. | 200 | 80 | 300 | 267 | 77 |
| కృష్ణా | 200 | 91 | 200 | 293 | 7 |
| గుంటూరు | 200 | 123 | 350 | 344 | 17 |
| ప్రకాశం | 200 | 118 | 200 | 265 | 13 |
| నెల్లూరు | 100 | 46 | 300 | 482 | 6 |
| చిత్తూరు | 50 | 15 | 50 | 22 | 1 |
| కర్నూలు | 50 | 2 | 25 | 43 | — |
| అనంతపురం | 50 | 9 | 25 | 10 | — |
| ఖమ్మం | 200 | 182 | 350 | 262 | 17 |
| నల్గొండ | 50 | 65 | 100 | 118 | 9 |
| వరంగల్ | 100 | 82 | 100 | 81 | 1 |
| హైదరాబాద్ | 50 | 17 | 50 | 70 | 1 |
| నిజామాబాద్ | 50 | 19 | 200 | 69 | 8 |
| మ. నగర్ | 50 | 57 | 50 | 95 | 4 |
| ఆదిలాబాద్ | 50 | 9 | 25 | 44 | — |
| మెదక్, కడప, కరీంనగర్, శ్రీకాకుళం | 50 | 3 | 50 | 7 | 1 |
| | 2000 | 1117 | 3000 | 3005 | 207 |

పత్రిక స్పెషల్ క్యాంపెయిన్‌లో తూ॥ గో॥, ఖమ్మం, గుంటూరు జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చాయి.

జనరల్ క్యాంపెయిన్‌లో తూ॥గో॥, నెల్లూరు, గుంటూరు జిల్లాలు ప్రథమ. ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చాయి.

స్పెషల్ క్యాంపెయిన్‌లో నల్గొండ, మ॥ నగర్ జిల్లాలు, జనరల్ క్యాంపెయిన్‌లో నెల్లూరు, కృష్ణా, ప్రకాశం, కర్నూలు, నల్గొండ, హైదరాబాద్, మ॥ నగర్, ఆదిలాబాద్ జిల్లాలు, కోటాల్ని అధిగమించాయి.

రెండు క్యాంపెయిన్లలో కలిపి నెల్లూరు, నల్గొండ, మ॥నగర్ జిల్లాలు మొత్తం కోటాల్ని అధిగమించాయి.

జీవిత చందాల్లో ప॥గో॥జిల్లా అగ్రభాగంలో ఉన్నది.

—— ఈవిధంగా కోటాల్ని అధిగమించినవారికి బహుమతులు పొందిన వారికి, క్యాంపెయిన్లు దిగ్విజయం చేసినవారికి కార్యకర్త లందరికి మా జేజేలు.

వ్యక్తిగతంగా 10 పత్రికల పైన చేర్పినవారిపేర్లు తర్వాత ప్రకటించగలం. సం॥

★

దాపున కూలిన పూరిగుడిసె పాఠశాల
ఇది ఆరునెలలు జీతాల్లేని అధ్యాపకుని ఆకలి కాలం
——ఇది సాంఘికం.




## ఒరిస్సాలో టీచర్ల ఆందోళన

రిటైర్‌మెంట్ సౌకర్యాలు కల్పించాలని, వేతనాలు సక్రమముగా అందజేయాలని, ప్రభుత్వేతర విద్యా సంస్థలలోని టీచర్లకు రాజకీయ హక్కులివ్వాలని, ఆ విద్యాసంస్థల్ని సక్రమంగా నిర్వహించాలని దాదాపు 85 వేలమంది టీచర్లకు ప్రాతినిధ్యం వహించే ఒరిస్సాలోని టీచర్ల యూనియన్‌లు ఆందోళనకు పూనుకొన్నాయి.

దానిలో భాగంగా మార్చి 28 న శాసనసభ ముందు టీచర్లు ఊరేగింపుగావచ్చి ధర్నా చేశారు. ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించి ధర్నా చేసిన టీచర్లను అరెస్టు చేయడం జరిగింది.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంప్రదింపుల సంఘం ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి చెందిన సమస్యల్ని క్షుణ్ణంగా పరిశీలించి సముచితమైన పరిష్కారం కనుగొనేందుకు సంప్రదింపుల సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామని, శాసనసభ ప్రస్తుత సమావేశం ముగియగానే ఆ ఏర్పాటు జరుగుతుందని మార్చి 27న విద్యాశాఖా మంత్రి శాసన మండలిలో చెప్పేరు.

## ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంయుక్త మండలి

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు మార్చి 1 న హైదరాబాద్‌లో సమావేశమై 'ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల సంయుక్త మండలి'గా రూపొందటానికి నిశ్చయించాయి.

ఆ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎన్.జి.ఓ. అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, స్టేట్ టీచర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ లెక్చెరర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ సెక్రటేరియట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, అఫిలియేటెడ్ కాలేజి టీచర్స్ అసోసియేషన్, తెలంగాణా ఎయిడెడ్ అండ్ ప్రైవేట్ టీచర్స్ గిల్డ్, పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ సెకండరీస్కూల్స్ అసోసియేషన్, నాన్‌టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఎయిడెడ్ అండ్ ప్రైవేట్ స్కూల్స్ నాన్‌టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ (తెలంగాణా) ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని పై నిర్ణయం చేశారు.

## మీసా రద్దుకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

ప్రివెంటివ్ డిటెన్షన్‌కై ప్రత్యామ్నాయ శాసనమేదీ చేయకుండానే, ఆంతరంగిక భద్రతా చట్టాన్ని (మీసా) రద్దు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయం గైకొన్నట్టు హోం మంత్రి మార్చి 23న పార్లమెంటులో ప్రకటించారు.

## నిర్బంధ రిటైర్‌మెంట్‌కు గురయిన ఉద్యోగుల కేసులపై ఏప్రిల్ అఖరులోగా ప్రభుత్వ నిర్ణయం

పదవీ విరమణ గడువు పూర్తిగాకుండానే ఉద్యోగాల నుండి రిటైర్ చేసిన ఉద్యోగుల విషయమై ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరులోగా ప్రాథమిక సాక్ష్యాల ఆధారంగా కడపటి నిర్ణయం గైకొనగలదని శాసన మండలిలో పరంపరగా వచ్చిన అనుబంధ ప్రశ్నలకు సమాధానంగా ముఖ్యమంత్రి డా. చెన్నారెడ్డి మార్చి 17 న శాసన మండలిలో ప్రకటించారు.

అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న కాలంలో చాలమంది ఉద్యోగులను వ్యక్తిగత కక్షలపై నిర్బంధ రిటైర్‌మెంట్‌కు గురిచేశారని కనీసం వారిని సంజాయిషీ కూడా అడక్కుండా ఆ చర్య తీసుకొన్నారని అందువల్ల వారిని బేషరతుగా ఉద్యోగాలలో చేర్చుకోవాలని ప్రతిపక్ష సభ్యులు వాదించగా, దానికి నిరాకరించి ముఖ్యమంత్రి పై ప్రకటన చేశారు.

## కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ళలో గుత్త పెట్టుబడిదార్ల లాభాలు 70 శాతం పెరుగుదల

1972-75 మధ్య నాల్గు సంవత్సరాల కాలంలో దేశంలో 45 గుత్త పారిశ్రామిక సంస్థల లాభాలు 60 నుండి 70 శాతందాకా కొన్నిసందర్భాలలో 100 శాతందాకా పెరిగినట్టు మార్చి 23 న లోక్‌సభలో ప్రభుత్వం లిఖితరూపంలో ఇచ్చిన సమాధానంలో వెల్లడయింది. ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| గుత్తవ్యాపార సంస్థలు | లాభాల పెరుగుదల | |
|---|---|---|
| | 19ˉ2 | 1975 |
| | కోట్లలో | |
| తాతా సంస్థలు | 48 | 75.45 |
| బిర్లాలు | 44 | 69 |
| మఫత్‌లాల్ | 14 | 22 |
| సింఘానియా | 5 | 16.38 |
| థాపర్ | 11 | 26,69 |
| సింధియా | 5 | 16.84 |
| ఐ. సి. ఐ. | 17 | 22 |
| శ్రీరామ | 10 | 15 |
| ఎ. సి. సి. | 4.45 | 10.21 |
| బంగూర్ | 7 | 8.39 |
| కిర్లోస్కర్ | 2.10 | 13.93 |
| లార్సెన్-టోబ్రో | 4.65 | 11.47 |
| వాల్చంద్ | 1.22 | 4.34 |
| ఖటావ్ | 5.57 | 16.66 |
| మాక్‌నెయిల్-మాగోర్ | 4.43 | 7.26 |
| కస్తూరిభాయ్ | 9.04 | 15.52 |
| టి. వి. యస్. అయ్యంగార్ | 7.72 | 13.32 |
| డన్‌లప్ | 2.63 | 9.43 |
| జెమ్సిఫిన్‌లె | 1.05 | 6.85 |

★

# ప్రశ్నోత్తరాలు

### శ్రీ బి. కనకం, కురుమద్దాలి, కృష్ణాజిల్లా

ప్రశ్న : నేను కురుమద్దాలి, పి.యస్.యు.పి. స్కూలు ఉపాధ్యాయుడను. ఇద్దరుపిల్లల తరువాత తేది3-1-1976 కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకొంటిని. రెండు అదనపు యింక్రిమెంట్లు మంజూరు చేయవలసినదిగా దరఖాస్తు పంపుకోగా, తేది 3-9-1976న అపరేషను చేయించుకొన్నవారికి, ఈ యింక్రిమెంట్ల మంజూరు ఉత్తరువు వర్తించదని మా సమితి అధికారులు అనుచున్నారు. నాకు ఈ అదనపు యింక్రిమెంట్లు మంజూరుఅగు అవకాశములేదా ? తెలియపర్చండి.

జవాబు :- పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే యిందుకు సంబంధించిన జి.ఓ.యం.యస్. నెం. 141 పంచాయితీరాజ్ (ఎస్టాబ్లిష్‌మెంటు iv) డిపార్టుమెంటు తేదీ 19-2-1977ను పరిశీలించాను. అందులోని 7 వ అయిటము క్రింద "shall take effect from 20 th August, 1976" అని యున్నది. అనగా తేదీ 20-8-1976 నుండి ఆపరేషను చేయించుకొన్న వారందరికిని యింక్రిమెంట్లు మంజూరు చేయాలని, దాని అర్థముగాదా ! ఈ సంగతిని మీ సమితి అధికారుల దృష్టికి తీసుకొనివచ్చి, ఇంక్రిమెంట్లను మంజూరు చేయించుకొనండి.

### శ్రీ ఎ. నరసింగరావు, గణేశ్‌నగర్, విశాఖపట్నం.

ప్రశ్న : నేను టి.ఎస్.ఎల్.సి. సెకండరీగ్రేడు ప్యాసయితిని. నా వయస్సు 30 సంవత్సరములు దాటినది. ప్రభుత్వము ఈ మధ్య జారీచేసిన గరిష్ట వయోపరిమితి ఉత్తరువుమేరకు నాకు ఉద్యోగము పొందే అవకాశమున్నదా ? తెలుపండి.

జవాబు : లేదు. కాని 30 సంవత్సరముల వయస్సు పూర్తి చేయని, క్వాలిఫైడు మరియు సూటబుల్ అభ్యర్థి లభ్యముగానపుడు, స్కూలు ఎడ్యుకేషన్ డైరక్టరుగారి ముందు ఆమోదమును పొంది మీరు ఉపాధ్యాయుడుగా నియమించబడు అవకాశముంది. జి.ఓ.యం.యస్. నెం. 1089 ఎడ్యుకేషన్ (జి) డిపార్టుమెంటు తేది 23-11-1977 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ రూల్సు 16 (1) గా చేర్చబడిన రూలు (డి) లో "If it is proposed to fill a vacancy in any of the posts of teachers by direct recruitment of men / women candidates and if no qualified and suitable candidates who has not completed the age of 30 years is available for appointment, a candidate who is otherwise qualified and who has not completed the age of 40 years, may be appointed with the previous approved of the Director of School Education" అనియున్న యిందుకు సంబంధించిన ఆదేశమును పరిశీలించండి.

ప్రశ్న : పైవిధముగా ఉపాధ్యాయుల నియామకమునకు గరిష్ట వయోపరిమితి విధించడం ఎంతవరకు సమంజసము ? దీని రద్దుకొరకు మనమేమిచేయాలి ? వివరించండి.

జవాబు : అసలు సమంజసముగాదు. విద్యావ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని ఇంతకుముందు ఉపాధ్యాయులకు గరిష్ఠ వయోపరిమితి విధించని ప్రభుత్వము, ఇప్పుడు "యూనిఫార్మిటీ" పేరుతో గరిష్ఠ వయోపరిమితిని ఉపాధ్యాయులకు విధించడము, మిక్కిలి సంకుచితముగానుండి, విద్యావ్యాప్తికి అవరోధముగానుండుటయేగాక, నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటూ, ఉద్యోగము దొరకని పరిస్థితిలో గరిష్ఠవయోపరిమితి దాటిపోయిన మీలాంటి క్వాలిఫైడు ఉపాధ్యాయులందరు విద్యావ్యాప్తికి కృషిచేయకుండా నిరోధించబడుచున్నారు. అందువలన విశాలదృక్పథముతో ప్రదేశ్ ప్రభుత్వము ఉపాధ్యాయులగు ఈ గరిష్ఠ వయోపరిమితి విధించు జి.ఓ.ను ఉపసంహరించి విద్యావ్యాప్తికి ఏర్పడిన ఆటంకమును తొలగించాలని మన మందరము శక్తివంతమైన ఆందోళనను నిర్మించడము ఆవసరము. (30 సం॥లు వయోపరిమితి ప్రభుత్వం ఉపసంహరించుకొన్నట్లు పత్రికల్లో వార్త వచ్చినది. కాని జి. ఓ. ఇంకా రాలేదు.)

### శ్రీ డి. కోటయ్య, టీచరు, సింగనలతూరు, నెల్లూరు జిల్లా.

ప్రశ్న : తుపాను ప్రాంతమంతటికిని, "సి. డి" చెల్లింపును గురించి ప్రభుత్వం జారీచేసిన మెమోరాండము నెం. 99308/ఎ/203/ ఎక్కౌంట్సు II /77-1 తే. 1-12-77 ను డిశంబరు 77 ఐక్య ఉపాధ్యాయలో ప్రచురించారుగదా ! ఈ మెమోరాండములోని ఆదేశముల మేరకు, సి. డి మిగతా మూడు మొత్తములు చెల్లించుతారా ? లేక 1976 జూలై నుండి 1977 ఏప్రిల్ వరకు గల మొత్తమును యిస్తారా ? తెలియజేయండి.

జవాబు : తుపానువలన యేర్పడిన అమిత కష్టనష్టముల నుండి కోలుకొనుటకుగాను, సి. డి. లో 1977 సం॥ ఏప్రిల్ నెల వరకును నిలువలోనున్న పాత, క్రొత్త ఎక్కౌంట్లలోని పూర్తి మొత్తములను ఉపాధ్యాయులకు వాపసు చేయవలసియుంది. ఈ విషయములో ప్రభుత్వము జారీచేసిన గవర్నమెంటు మెమో నెం. 88076 ఎ/199/ఎక్కౌంట్సు II / 771 తే 23-11-1977 మరియు గవర్నమెంటు మెమో నెం. 106650 ఎ/234 ఎక్కౌంట్సు II/77-1 తే 28-12-1977 లను పరిశీలించండి. ఈ మెమోలను 1977 డిసెంబరు, 1978 జనవరి నెలల ఐక్యఉపాధ్యాయ పత్రికలలో ప్రచురించాము - చూడండి.

### శ్రీ కె. పట్టాభిరామారెడ్డి, పరిషత్ హైస్కూలు, బిక్కవోలు.

ప్రశ్న : "అప్రూవుడు ప్రొబేషనరు" అయిన ఒక ఉపాధ్యాయుడు వేసవి శలవులకు పాఠశాల మూయబడురోజునగాని, శలవుల అనంతరము పాఠశాల ప్రారంభదినమునకుగాని డిగ్రీ పరీక్షకు హాజరు కావలసిన పరిస్థితి వచ్చినపుడు ఆ ఉపాధ్యాయునకు యెట్టి శలవు మంజూరు చేయవలెను? మంజూరుచేయు అధికారము మేనేజిమెంటుకా? లేక ప్రధానోపాధ్యాయులకా? ఎవరికున్నది?

జవాబు : అటువంటి పరిస్థితి ఏర్పడినపుడు వెకేషన్ క్యాజుయల్ లేక స్పెషల్ క్యాజుయల్ లీవు కుదరనుగాదు గాబట్టి వేసవి శలవులకు పాఠశాల మూయబడిన రోజునగాని, అనంతరము పాఠ

శాల ప్రారంభించు దినమునగాని వెకేషనుతో కలియకుండా ప్రిఫిక్స్ లేక ఎఫిక్సు చేసుకొంటూ వెకేషనుతో కలిపి పెనుగాల "ఎర్నుడు లీవు" లేక "హాఫ్ పే లీవు" లేక "ఎక్స్ట్రా ఆర్డినరీ లీవు" మంజూరు చేయవచ్చును. మంజూరుచేయు అధికారము మేనేజిమెంటుదే. అయితే మేనేజిమెంటు అధికారమును బదలాయించినప్పుడు హెడ్మాష్టరుగారు గూడా మంజూరు చేయవచ్చును.

## శ్రీ పి. పర్వతరెడ్డి, జూ. హిం. పండిట్, ఎల్లికల్, మహబూబ్‌నగర్ జిల్లా.

ప్రశ్న : నేను ఎస్.జి బి.టి. ప్యాసైన ఉపాధ్యాయుడను తే. 5_12_63 న రూ. 65_95 గ్రేడులో రూ. 73 ల జీతము మీద డి.ఇ.ఓ.గారిచే నియమించబడితిని. తే. 22_8_64 న రూ. 80_150 గ్రేడులో ప్రమోటు చేయబడితిని. తిరిగి తే.27_8_66 న జూనియర్ హిందీ పండిత్‌గా రూ.100_150 గ్రేడులో రూ. 100 ల జీతము మీద ప్రమోటుచేయబడితిని. 1974 జనవరిలో బి. యిడి. పూర్తి చేసితిని. డి.యస్.సి.చేత సెలెక్టుచేయబడిన నాకన్న జూనియర్సును రు. 320_580 గ్రేడులో స్కూలు అసిస్టెంట్లుగా 1976 లో మహబూబునగర్ జిల్లాకలెక్టరు ప్రమోట్ చేశారు. నేను పిటీషనును పంపగా హిందీ పండిట్‌గా యున్నందున దొరుకదనిరి. ఇందువలన నేను నష్టపోయితిని. ఇది సక్రమమేనా ? నేను యిందువలన రు. 290_520 గ్రేడులో రు. 378/-లు మాత్రం జీతము పొందుచున్నాను. ఈ స్థితిలో నేను యస్. జి. బి. టి. పోస్టుకు రివర్షన్ తీసుకొన్నయెడల నా బేసిక్ తగ్గగలదా ? మార్గమును చెప్పండి.

జవాబు : ప్రారంభములో డి. ఇ. ఓ. గారిచేత మీరు నియమించబడినను, మీరు పంచాయితీరాజ్ సర్వీసులో స్థిరపడిన ఉపాధ్యాయులని అర్థము చేసుకొంటున్నాము. మీ జిల్లా పరిషత్ స్పెషలాఫీసరుగానున్న కలెక్టరుచెప్పిన కారణము ఉచితముగాలేదు. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ యూనిటులోని లోయరు పోస్టులలో పని చేస్తున్న క్వాలిఫైడు వ్యక్తులను, సెకండరీ స్కూళ్ళలోని, హెడ్మాష్టరు, లేక హెడ్మిస్ట్రెస్సుల పోష్టులనుతప్ప మిగిలిన అన్ని పోష్టులను ప్రమోషనుద్వారా నింపవచ్చును. జి. బి. యం. యస్. నెం. 417 పంచాయితీరాజ్ (సమితిii) తేది 1-4-1965 ద్వారా"

"Rules relating to constitution of selection committee for the posts included in the district cadre" నకు సవరణగా జారీచేసిన 2-డి (i) లో "The posts of all types of teachers (including specialist teachers in secondary schools under the zilla parishads expecting Head masters and head mistresses of such schools shall be filled in by Promoting qualified persons from lower ranks (including those working in primary schools under panchayat Samithis) if there are available and resort to direct recruitment only when qualified Persons in lower ranks in the Elementary unit are not available" అని యున్న ఆదేశమును మీ జిల్లా పరిషత్ స్పెషలాఫీసరు మరియు కలెక్టరుగారి దృష్టికి తెచ్చి ఒకదరఖాస్తుద్వారా తీసుకొనివచ్చి బి.యిడి. పోస్టులోని ప్రమోషను పొందండి. నష్టము కలిగించే రివర్షనుకు ప్రయత్నించవద్దు.



**కృష్ణా జిల్లాకు (ఉయ్యూరు సమితికి) :** పి. సరోజనీదేవి, హైయర్‌గ్రేడ్, యు. పి. స్కూలు, శ్రీనగర్ పోస్టు, వయా, వర్ని 503201, నిజామాబాద్‌జిల్లా.

యం. వి. సీతారామయ్య, వీవింగ్ టీచర్, దుగ్గిరాల (బాయ్స్) తెనాలి తాలూకా, గుంటూరుజిల్లా.

**మెదక్ లేదా హైదరాబాద్ జిల్లాలకు :** యం. భద్రయ్య, హిందీ పండిట్ గ్రేడ్ II, యు.పి. స్కూలు, హసాకొత్తూర్. వయా, కమ్మర్‌పల్లి, ఆర్మూర్ తాలూకా, నిజామాబాద్ జిల్లా.

**పశ్చిమ గోదావరి జిల్లాకు :** కె. రాజరత్నం, సెకండరీగ్రేడ్, యస్. యి. స్కూలు, ర్యాలి, తూ. గో. జిల్లా.

**ఖమ్మం జిల్లాకు:** యన్. సి. హెచ్. సీత, గ్రేడ్ II తెలుగు పండిట్, జడ్. పి. హైస్కూలు, కైకరం, పశ్చిమ గోదావరి జిల్లా 534116

**గుంటూరుజిల్లాకు(తెనాలిసమితి):** ఎ. ప్రసాద్, సెకండరీగ్రేడ్, సి. పి. స్కూలు, లింగాల 509 401 మ నగర్‌జిల్లా.

**త్యాళ్ళూరు, రాజుపాలెం, ఫిరంగిపురం సమితులకు :** పి. సత్యవతి, సెకండరీగ్రేడ్, పి యస్.(యస్.డబ్ల్యు) ఎలిమెంటరీ స్కూలు, చందోలు, బాపట్ల సమితి.

**విశాఖ, ఉభయ గోదావరులు, కృష్ణా, గుంటూరు ఏజిల్లాకైనా :** (హైస్కూళ్ళకు) బి. ప్రహ్లాద బి యస్‌సి., బి. యిడి., యు. పి. హైస్కూలు, ఎదకుల చెరువు, డోన్ సమితి, కర్నూలు జిల్లా.

**ప్రకాశం జిల్లా, మార్కాపురం, తర్లుపాడు, సమితులకు :** జి. పురుషోత్తమరావు, సెకండరీగ్రేడ్. యు.పి. స్కూలు, లక్ష్మీపురం, ఉదయగిరి సమితి, నెల్లూరు జిల్లా.

**పొదిలి సమితికి :** షేక్ ఇమాంషరీఫ్, హెచ్. యం. సమితి ప్రాథమిక పాఠశాల కోట, నెల్లూరు జిల్లా.

**మహబూబ్‌నగర్ జిల్లాకు :** డి. వేణుగోపాలస్వామి, జె.యస్. ఎకనామిక్స్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, మంచిర్యాల అదిలాబాద్ జిల్లా.

**నెల్లూరుజిల్లా ( కోటసమితికి )** షేక్ అబ్దుల్ అజీజ్, టీచర్, పరసారెడ్డిపల్లి, వయా, కలిచేడు, రాపూరు తాలూకా.

**కరీంనగర్, వరంగల్ జిల్లాలకు :** యి. సత్యనారాయణ, బి. యస్. సి. లెక్కలు, జడ్. పి. యస్. మనుగూరు, బూర్గంపాడు తాలూకా, ఖమ్మంజిల్లా.

# విద్యా రంగంలో తీవ్ర సంక్షోభం

—శ్రీ కౌమరేష్ చక్రవర్తి

అవి ఇందిరాగాంధీ ఇరవై అంశాలను గురించి దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నీకూడా భజనలుసాగిస్తున్న 1975వ సంవత్సరం. ఆ కాలంలో హరియానాలో జరిపిన ఒక విద్యా సర్వేలో గుర్గాన్ జిల్లాలోని 186 గ్రామాల్లోనూ చదువువచ్చిన స్త్రీ ఒకరుకూడా లేరని తేలింది. అయితే నిర్బంధ ప్రాథమిక విద్యాచట్టం ఆ రాష్ట్రం పుట్టినప్పటినుండీ వుందనుకోండి!

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో జరిపిన మరొక తాజా సర్వేలో అక్కడి గిరిజనుల పిల్లల్లో చదువు మానుకునేవారి సంఖ్య గత పది సంత్సరాలలో వేగంగా పెరుగుతోందని ఈ అయిదేళ్ళలో అది మరింతగా పెరిగిందని బయటపడింది.

దేశంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలోని విద్యార్థుల సంఖ్య గత పది సంవత్సరాలలోనూ ఒకటి లేదా రెండు రెట్లుగా పడిపోయింది. విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్యలో పెంపుదల 1960 మధ్యకాలంలో 11 శాతంగా ఉన్నది కాస్తా ప్రస్తుత దశాబ్దంలో 2.5 శాతానికి పడిపోయింది.




నిరక్షరాస్యుల సంఖ్య పెరుగుతుండటం కూడా 'తేటతెల్లం'గానే కనిపిస్తున్నది. ఇవన్నీ మన విద్యా వ్యవస్థలో సంక్షోభానికి స్పష్టమైన నిదర్శనాలు. ఆ సంక్షోభం ఆర్థికరంగంలోని సంక్షోభం కారణంగా మరింత పెరుగుతోందని కూడా ఇప్పుడు స్పష్టమవుతున్నది. ఇది 30 సంవత్సరాల కాంగ్రెసు పాలనా ఫలితమే.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విద్యారంగాన్ని గూర్చి ఆలోచించాల్సి వచ్చేసరికి జనతా పార్టీ కూడా తాను కాంగ్రెసుకు భిన్నమేమీకాదని అంతకంతకూ మరింతగా బయటపడుతోంది.

## ప్రభుత్వ విధానం

ఒక నిర్ణీతకాలంలో మాధ్యమిక విద్యను అందరికీ అందించడానికి మొదట ఆ పార్టీ వాగ్దానం చేసింది. కాని అది ప్రస్తుతం మరొక కొత్తపాట మొదలుపెట్టింది. "ప్రాథమిక విద్య సార్వజనీనం చేయాలి" అనేదే ఆ కొత్త నినాదం. "నిర్బంధ ప్రాథమిక విద్య" అర్థం "సార్వజనీనం చేయుట"కంటే భిన్నమైనదనే విషయం అది కావాలనే మరచిపోయింది.

ఈ సమస్యపట్ల ప్రభుత్వం యొక్క వైఖరిని వివిధ అంశాలకు అది యిచ్చే ప్రాధాన్యతను పైవిషయం ప్రతిబింబిస్తోంది. "దరిద్రాన్ని ముందుగా తొలగించనిదే" నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు జరపడం సాధ్యంకాదని అయిదవ ప్రణాళిక మొదలుపెట్టినప్పటినుంచీ చెప్పడం జరుగుతూనే ఉన్నది. అంతేకాక ఉన్నత పాఠశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలోనుండి వచ్చే వత్తిడివల్ల ప్రభుత్వం ఈ రెండు రంగాలమీదా "వ్యర్థపు" ఖర్చులు పెట్టవలసి వస్తుందనీ, కనుక ప్రాథమిక విద్యారంగానికి చాలినన్ని నిధులు కేటాయించలేక పోతున్నదని కూడా చెప్పబడింది. పదకొండవ తరగతిలోనూ, ఆ పైనా ఎన్నిక చేసిన విద్యార్థులనే చేర్చుకునే పద్ధతిని ప్రమాణాల పెంపుదలగాకూడా పై వాదన సమర్థించవచ్చు.

## తగ్గిస్తూ వస్తున్న విద్యా వ్యయం

మరోవైపున ప్రత్యేకించి గత అయిదారు సంవత్సరాలుగా విద్యారంగంమీద ప్రభుత్వం వ్యయం పూర్తిగా తగ్గిస్తూ వస్తున్నది. ఈ కారణంగా విద్యారంగంలోని అన్ని దశలూ — ప్రాథమిక దశ మొదలు ఉన్నతవిద్యదాకా అనేక అవరోధాలు ఎదుర్కోవలసి వస్తున్నది. ఇది ఒకవైపున ప్రజలకున్న విద్యాహక్కును నిరాకరించడం మరోవైపున ఆర్థిక సంక్షోభపుభారాన్ని పరోక్షంగా ప్రజల మీదకు నెట్టడం తప్ప మరొకటి కాదు. గత సంవత్సరం కేంద్ర బడ్జెట్ లో విద్యారంగం శాతాన్ని తగ్గించినపుడు కేంద్ర ప్రభుత్వం స్వభావం ఏమిటో వెల్లడైంది.

1984 వ సంవత్సరంలోగా ప్రాథమిక(ఎలిమెంటరీ) విద్యను సార్వజనీనం చేయాలన్నది ప్రస్తుత కొత్త నినాదం.

1984 కంతా 6–11 సంవతరాల మధ్య వయస్సు గలవారికేగాక 11–14 సం॥ల మధ్యగల వారందరికీ కూడా విద్యనందించేట్లుగా ఈ నినాదం స్ఫురిస్తోంది. (అధికారమైన అపసవ్యపు భాషలో ఎలిమెంటరీ విద్య అంటే 8వ తరగతి వరకూ అనీ, ప్రైమరీ విద్య అంటే 5వ తరగతి వరకు అనీ అర్థం.) ఈ నిర్ణయంతో, లక్ష్యంతో ప్రభుత్వం అందరికీ పాఠశాలల వసతులు కల్పించేందుకు బాధ్యత చేపడుతోంది. అయితే అంతమాత్రాన ఆ వయస్సులో బాలబాలికలందరినీ పాఠశాలలకు వెళ్ళేలా చూస్తానని ప్రాథమిక విద్యాదశలో చివరిదాకా చేరుస్తాననీ గ్యారంటీ చేయటంగాదు. కాని నిజానికి నిర్బంధ ప్రాథమిక విద్యను అమలుపరచటమంటే పిల్లలకు పాఠశాలా వసతులు కల్పించటం మాత్రమేకాదు. ఆ విద్యను అభ్యసించేందుకు అవసరమైన భౌతిక పరిస్థితులను కలిగించడం కూడా అనే అర్థం. ప్రజలకు విద్యా హక్కును గ్యారంటీ చేయటమంటే అర్థం ఇది మాత్రమే.

## మధ్యలో చదువు మానివేసేవారి పెరుగుదల

విద్యార్థిగా పాఠశాలలో చేరడం ఒకభాగమైతే అవసరమైనంత కాలమూ విద్యార్థిగావుండి విద్యపూర్తి చేయడమనేది మరొక భాగం. అందువల్లనే పాఠశాలల్లోని విద్యార్థుల జాబితాలు, మరీముఖ్యంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో తప్పుద్రోవ పట్టిస్తాయి. మూడవ విద్యాసర్వేనుబట్టి 1వ తరగతిలో చేరిన ప్రతి వందమంది పిల్లలలోనూ రెండవ తరగతికి వచ్చేసరికి 40 మంది, 5వ తరగతికి వచ్చేసరికి 60 మంది స్కూలు వదలిపెట్టి చదువు మానేసి వెళ్ళిపోతున్నారని వెల్లడైంది. ఇలా మానివేసిన వారిలో ఎక్కువభాగం నిరక్షరాస్యుల సేనావాహినిలో చేరిపోతారు.

ఈ చదువు మానివేసేవారి సంఖ్య సాధారణంగా అమ్మాయిలలో ఎక్కువగా వుంది. షెడ్యూల్డు కులాలు, తెగలు మహమ్మదీయులలో ఈ సంఖ్య ప్రత్యేకించి మరీ ఎక్కువగా వుంది. కఠోరమైన దారిద్ర్యం, పసిపిల్లల శ్రమమీద ఆధారపడవలసి రావడం ఈ చదువు మానివేయడానికి ప్రధాన కారణాలు. ఆ శ్రమకు డబ్బులు రానూవచ్చు. రాకపోనూవచ్చు. అందువల్ల పేద పిల్లలకోసం పాఠశాలలు తెరవడం అనేది ఈ సమస్య కొనలను మాత్రమే స్పృశించగలదు. ఉదాహరణకు హరియానా, పంజాబు రాష్ట్రాలలో నిర్బంధ ప్రాథమిక విద్యాచట్టాలు ఉన్నాయి, కాని అక్కడి చదువుకునేపిల్లల సంఖ్య మాత్రం చెప్పుకోదగినంతగా లేదు. ఈ రాష్ట్రాల్లో చదువు మానుకునేవారి సంఖ్యకూడా మిగతా రాష్ట్రాలకంటే ఏమీతక్కువగా లేదు. ఎక్కువ పాఠశాలలు తెరవడంద్వారా విద్యను సార్వజనీనం చేయడమనే లక్ష్యం ఎంత తక్కువగా నెరవేరుతుందో దీన్ని బట్టి తెలుస్తోంది.

అయితే విద్యార్థులను పాఠశాలలో చేర్చుకునే మేరకైనా అవకాశాలను విస్తృత పర్చడమనేచర్య దానివరకూ అభివృద్ధికరమైనదే. కాని ప్రభుత్వం దీన్ని గురించికూడా తీవ్రంగా పట్టించుకున్నట్లు కనిపించదు. విద్యారంగం కోసం అదనపు వనరులను ఖర్చుపెట్టడమనేది అత్యవసరం.

## నేటికీ పాఠశాలల్లేని 2 లక్షల గ్రామాలు

వాస్తవానికి ఈ రోజున్న పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉన్నది, చాలా రాష్ట్రాల్లో పాఠశాలల్లో పిల్లలసంఖ్యలో పెరుగుదల స్థాయి జనాభా పెరుగుదల స్థాయికంటే తక్కువగా ఉన్నది. మరికొన్ని రాష్ట్రాల్లో ఆ సంఖ్య గత సంవత్సరాలతో పోల్చితే సాపేక్షంగా పడిపోతూ ఉంది. 1976-77 లో అనేక రాష్ట్రాల్లో 6-11 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలలో 30-40శాతంమంది కనీసం పాఠశాలల్లో చేరడంకూడా జరగలేదు. ఉదా : అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ మొదలైనవి. మాధ్యమిక దశకు వచ్చేసరికి దేశంలోని 15 ముఖ్య రాష్ట్రాలలోని తొమ్మిదింటిలో పాఠశాలల్లో చేరేవారి శాతం 40 కి లోపుగానే ఉంది. మళ్ళీ ఈ తొమ్మిది రాష్ట్రాల్లోకూడా ఆయిదింటిలో ఆశాతం25కు లోపుగాఉంది.

మూడవ విద్యా సర్వేనుబట్టి మనదేశం మొత్తంమీద ప్రాథమిక పాఠశాలలు 4.3 లక్షలు. వీటిలో గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవి 3.5 లక్షలు. అదే సమయంలో దేశంలోని నివాసయోగ్యమైన గ్రామాలు 5.5 లక్షలు. దీన్నిబట్టి అర్థమయ్యే దేమిటంటే దేశంలోని రెండులక్షల గ్రామాలలో నేటికీ పాఠశాలలు లేవు. 6వ తరగతినుంచి 8వ తరగతి వరకు ఉండే పాఠశాలలు దేశంమొత్తం మీద 90,000 మాత్రమే ఉన్నాయి. వీటిలో కనీసం మూడింట ఒక భాగం పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. అంటే గ్రామీణ ప్రాంతాలలో తొమ్మిది గ్రామాలకు ఒక్క పాఠశాల కంటేకూడా తక్కువగానే ఉన్నాయి.

## పాఠశాలల పరిస్థితి

అంతేకాదు. ఈ ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు మూడవ వంతుఅరకొర గృహాల్లోనూ, తాటాకు గుడిసెల్లోనూ నడుస్తున్నాయి. మరో 28,000 ఆరుబయలు బహిరంగ ప్రదేశాల్లో వున్నాయి. ఇక మాధ్యమిక పాఠశాలల విషయంలో మొత్తం 90,000 లోనూ 25 శాతం పాఠశాలలు తాటాకు గుడిసెల్లోనూ, మరో వెయ్యి ఆరుబయల్లోనూ ఉంటున్నాయి. చాలా సందర్భాలలో ఈ తాటాకు పాఠశాలలు, ఆరుబయలు పాఠశాలలు వర్షాకాలంలోనూ, అసాధారణ వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచెయ్యవు. 1973 తర్వాత ఈ పరిస్థితి బాగా మెరుగైందని భావించేందుకు కారణం కనపడదు.

దేశవ్యాపిత సగటునచూస్తే పాఠశాలలు ఒక్కొక్కదానిలో 150 మంది విద్యార్థులున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని వాటిలో ఈ సగటు 125 కంటే తక్కువగావుంది. అధికార లెక్కలనుబట్టి 1976-77 లో పాఠశాలల్లో చేరని 6-11 సం॥ బాలబాలికలు 150 లక్షలమంది, 11-15 సం॥ బాలబాలికలు 283 లక్షలమంది వున్నారు. ఈ రెండు విధాల బాలబాలికల సంఖ్య అంచనాలనుబట్టి 1981 అంటే ప్రాథమిక విద్యను సార్వజనీనం చేసేందుకు ప్రభుత్వం వాగ్దానం చేస్తున్న సంవత్సరానికంతా ఈ సంఖ్య 5 కోట్లు దాటుతుంది. వీళ్ళందరినీ చేర్చుకోడానికి అవసరమైనన్ని పాఠశాలలు కావాలంటే ప్రస్తుతమున్నవికాక 3.5 లక్షలు కావాలసివస్తుంది. ఒక్క ప్రాథమిక విద్యారంగానికి మాత్రమే 1.5 లక్షలదాకా పాఠశాలలు కావలసివస్తుంది.

ఈ పాఠశాలలన్నింటినీ నిర్వహించాలంటే చిత్తు లెక్క వేసినప్పటికి, ఉపాధ్యాయులకు రు. 200 వంటితక్కువ జీతం మాత్రమే యిచ్చి ఒక్కొక్కరికీ 50 మంది విద్యార్థులను కేటాయించినప్పటికీ సంవత్సరానికి మొత్తం రు. 150 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. లేదా ఒకప్రణాళికా కాలానికి రు. 750 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. (కేవలం జీతాలు, కొన్ని తప్పనిసరి ఖర్చులకు మాత్రమే.)

## రాష్ట్రాల మీద నిర్బంధం

ఇంతవరకు అనుసరిస్తూవస్తున్న వైఖరి ఏమిటి ? అయిదవ ప్రణాళిక కాలంలో ప్రాథమిక విద్యకు కేటాయించిన మొత్తం ఖర్చు రు. 500 కోట్లు. ప్రత్యేకించి 1971 తర్వాత విద్యారంగంపై ప్రభుత్వం ఖర్చుపెట్టే మొత్తం అత్యధిక రాష్ట్రాలలో తగ్గిపోతూ వస్తున్నది. ఈ తగ్గిపోవడం ప్రాథమిక విద్యలో మరీ ఎక్కువ. మరోవైపున బడా వ్యాపారవర్గానికి, భూస్వాములకూ సబ్సిడీలు మాత్రం త్వరితంగా పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర పోలీసుల మీద వ్యయం కూడా పెరిగింది.

ఉన్నత విద్యకోసం ఇచ్చే కొన్ని నిధులు మినహా రాష్ట్రాలలో విద్యా వ్యయాన్ని గురించి కేంద్రప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోదు. కనుక రాష్ట్రాలు కేంద్రం మీద అనివార్యంగా ఆధారపడవలసి వస్తున్నది. ప్రస్తుత కేంద్ర - రాష్ట్ర సంబంధాలలోనే వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక నిర్బంధాలు ఎదుర్కొనవలసివస్తున్నది.

## విధానాలలో మార్పు అవసరం

చివరగా, అందుతున్న సమాచారాన్నిబట్టి ప్రస్తుత ప్రణాళికలో కూడా విద్యా వ్యయం కేటాయింపులు ఏమాత్రం ఆశాజనకంగా లేవు.

ఈమధ్య ప్రమాణాల అభివృద్ధినిగూర్చి సుదీర్ఘ చర్చ సాగుతూనేవుంది. మంత్రివర్యుల ఆలోచనాతరంగాలు విద్యా విధానాన్ని గురించి 10 + 2, 8 + 4 మొదలైన కొత్తకొత్త లెక్కలు ఉత్పత్తి చేస్తూనే వున్నాయి. "నాన్‌ఫార్మల్" "అవుట్ ఆఫ్ స్కూల్"

## చందా దారులకు - కార్య కర్తలకు

1. పత్రిక మీకు చేరిన వెంటనే మీ అడ్రసు ప్రక్కగల చందా నెంబరు డైరీలో నోట్ చేసుకోండి.

2. అడ్రసు మార్పులుగాని, పత్రిక అందకపోవడం గురించిగాని వ్రాసేటప్పుడు విధిగా **చందా నెంబరు** తెలుపండి- లేనిచో పరిశీలింపబడవు.

3. చందాదారులు అడ్రసు విడి అక్షరాలతో, పిన్ కోడ్‌తో వ్రాయండి.

4. కార్యకర్తలు డూప్లికేటులో అడ్రసుల లిస్టులు పంపిన, నంబర్లు యిచ్చి ఒకటి పంపగలం.

5. పత్రిక సొమ్ము యం. ఒ. చేయువారు ఎడిటర్ ఐక్యఉపాధ్యాయ, అకులవారివీధి విజయవాడ-2 అడ్రసుకు పంపండి. యం. ఒ. కూపను క్రింద మీ పూర్తి అడ్రసు వ్రాయడం మరచిపోకండి.

6. సంఘం సొమ్ము యం. ఒ. చేయువారు ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అకులవారివీధి, విజయవాడ-2 అడ్రసుకు పంపండి.

7. పత్రిక సొమ్ము బ్యాంకు డ్రాఫ్టు ద్వారా పంపువారు **"IKYAUPADHYAYA"** పేర ఏ బ్యాంకు నుండి అయినా క్రాసుచేసి పంపవచ్చు.

8. సంఘము సొమ్ము బ్యాంకు డ్రాఫ్టు ద్వారా పంపువారు **"A. P, United teacher's federation"** పేరిట ఏ బ్యాంకు నుండి అయినా క్రాసుచేసి పంపండి.

9. చెన్నుపాటి భవన నిధికి యం. ఓ. చేయువారు ప్రధాన కార్యదర్శి పేరను, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా అయిన **"A. P. U. T. F. CHENNUPATI BULIDING FUND"** అనుపేర ఏ బ్యాంకు నుండి అయినా క్రాసు చేసి పంపించండి.

10. పత్రికకుగాని, సంఘమునకుగాని, భవన నిధికిగాని సొమ్ము పంపువారు ఎట్టి పరిస్థితులలోను వ్యక్తుల పేర పంపరాదు.

11. జీవిత చందాదారులు ఫోటోలు పంపించిన చాలు నెగెటివ్‌లు అక్కరలేదు.

విద్యఅనీ, వయోజన విద్యలనీ, "గ్రామీణ అభివృద్ధీ సాధనంగా విద్య"అనీ కొత్తకొత్త అవనపు అంకెలనూ సార్వజనీన ప్రాథమిక విద్యాలక్ష్యానికి జోడిస్తూనే వున్నారు. కాని ప్రభుత్వంయొక్క విధానాల్లో సమూలమైన మార్పు రానిదే, ఇతర సంస్కరణలతో పాటు నిర్బంధ ప్రాథమిక విద్యను లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం ఏమీ చేయనిదే యివన్నీ వట్టికబుర్లుగానే ఉండిపోతాయి. విద్యారంగానికి వనరుల కేటాయింపులోకూడా మార్పు రావాలి.

వ్యవసాయ సంస్కరణలను తిరగదోడుతున్న జనతాపార్టీ ఆర్థిక విధానమూ, అంతకంతకూ పసిపిల్లలు శ్రమపై ఆధారపడవలసి రావడమూ, భూమిలేని పేదవర్గం పెంపొందడం యివన్నీ కూడా నిరక్షరాస్య సేనా వాహినిని మరింతగా పెంచేందుకూ, చదువులు మానుకునే వారి సంఖ్య వృద్ధిచేసేందుకు మాత్రమే దోహదం చేస్తాయి. ★

## పాములూ - నిచ్చెనలూ

— యస్. ఆర్. కడలి, వేంద్ర.

నేటి విద్యా విధానం
పరమపద సోపానపటం
పావులు....పాపం....పసిపాపలు!
హాజరున్న చాలునట!
ఆరు తరగతులట!
ఏడిపించ ఏడవతరగతిలో
కట్లపాము కాటు!
ఎనిమిది తొమ్మిది తరగతులు
మళ్ళీ నిటారైన నిచ్చెనలు!
పదొక పెద్దపాము కాటుకాగా
పదేళ్ళ చదువు మళ్ళీ మట్టిపాలు!
ఇంటరొక హంటర్
అదొక నల్లత్రాచు కాటు!
— మూడు పాముకాట్లు
దాటలేక పాట్లు
అన్ని పాముల్నిదాటి
ఆఖరు మెట్టెక్కినా
మళ్ళీ నిరుద్యోగం....నీరసం!
ఇదీ భావిపౌరుడి గతి!
నేటి విద్యావిధాన దుర్గతి!



చి॥ వెంకటేశ్వర్లు, చి॥ సౌ॥ వెంకట సుశీలల
వివాహ కానుక రు. 58/-



శ్రీ కె. సత్యనారాయణ, సిద్ధాంతం, ప.గో.జిల్లా.
భవన నిధికి రు. 116/-

# ప్రాథమిక విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ ఆవశ్యకత

—శ్రీ ఎ. కృష్ణారెడ్డి

## నిరక్షరాస్యత .... నిరుద్యోగం

స్వాతంత్ర్యంవచ్చి మూడు దశాబ్దాలు అయినప్పటికీ ప్రాథమిక విద్యారంగంలో ఆశించిన ఫలితాలు లభించలేదు. రాజ్యాంగములో నిర్దేశించిన 14 సంవత్సరాలలోపు వయస్సు వారందరికి పదేళ్ళలో నిర్బంధ ప్రాథమిక విద్యను గరపాలనే లక్ష్యం ఇంత వరకు నెరవేరలేదు. కాగా దేశంలో నిరక్షరాస్యత పెరిగింది. ప్రస్తుతం దేశంలో 23 కోట్లమంది నిరక్షరాస్యులువున్నట్టు తెలుస్తున్నది. విద్యావ్యాప్తికై ఈ మధ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగించడం జరుగుతున్నది. ఉపగ్రహాల ద్వారా, టెలివిజన్ ద్వారా కూడా విద్యాబోధన జరుగుతున్నది. అయినప్పటికీ దేశ పౌరులందరు అక్షరాస్యులు కాలేక పోతున్నారు. నేడు దేశంలో నాలుగుకోట్లమంది నిరుద్యోగులుగా వున్నట్టు అంచనా వేయబడింది. నిరుద్యోగ సమస్య చదువుకొనే విద్యార్థులను కలవర పెడుతున్నది,

## రివర్స్‌గేర్‌లో విద్యాపద్దు కేటాయింపులు

పంచవర్ష ప్రణాళికలో విద్యమీద కేటాయించే మొత్తం ఎప్పటికప్పుడు పెరిగినా ప్రాథమిక విద్యకు కేటాయించే మొత్తంలో క్రమక్రమంగా తగ్గుదల కనిపిస్తున్నది. ఉన్నత విద్యకు ఎక్కువ మొత్తం లభిస్తున్నది. మొదటి ప్రణాళికలో ప్రాథమిక విద్యకు 56 శాతం నిధులు కేటాయించగా నాల్గవ ప్రణాళికలో కేటాయింపు 28.5 శాతంవరకేవుంది. సెకండరీ విద్యకు 13 నుంచి 14.5 శాతం వరకు కేటాయింపు పెరిగింది. కాని ఉన్నత విద్యకు మాత్రం కేటాయింపులు 9 శాతంనుంచి 22.3 శాతం వరకు పెరిగాయి.

మన లక్ష్యాలలో ఒకటయిన సాంఘిక న్యాయం నెరవేరాలంటే అందరికి విద్య బోధించడం అవసరం. దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించగలిగితే మనం సాధించే సాంకేతిక ప్రగతి ఇనుమడిస్తుంది. విజ్ఞానశాస్త్ర ప్రయోజనాలు గ్రామీణులకు చేకూరగలవు.

## ఇతర దేశాల అనుభవాలు

రష్యా పంచవర్ష ప్రణాళికల ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించ గలిగింది. రష్యా ప్రభుత్వం ఈ పనిని రెండు దశాబ్దాలలో చేయగలిగింది. అంటే 1939 నాటికి రష్యా ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని సాధించింది. దక్షిణ కొరియా కూడా 1953-63 సంవత్సరాల మధ్య కాలంలో విద్యారంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఆ కాలంలో అక్షరాస్యుల సంఖ్య 30 శాతం నుంచి 80శాతం వరకు పెరిగింది. ఈ లక్ష్యసాధన కోసం బడ్జెట్‌లో 50 శాతం వరకు నిధులను కేటాయించడం జరిగింది. ఈ విధంగానే చైనా, క్యూబా, వియత్నామ్, అల్జీరియా మొదలగు దేశాలు కూడా తక్కువ వ్యవధిలో నిరక్ష్యరాస్యతను నిర్మూలించ గలిగాయి.

## ప్రాథమిక పాఠశాలల దుస్థితి

దేశంలో గ్రామాలన్నింటి స్వరూప స్వభావాలు ఒకేవిధంగా వుండవు. అందుచేత ఒక్కొక్క ప్రాంతంలో సమస్యలు ఒక్కొక్క రకంగా వుంటాయి. గ్రామాలలో ధనస్వాములు, భూస్వాములు, షావుకారులు పెత్తనం చెలాయిస్తున్నారు. దేశంలో సాధించే సాంకేతిక అభివృద్ధి ఫలితాలు అనుభవిస్తున్నారు. సమగ్రాభివృద్ధి జరగాలంటే గ్రామాలు వీరి పెత్తనం నుంచి బయటపడవలసి వుంది.

గ్రామాలలో పనిచేసే ప్రాథమిక పాఠశాలల పరిస్థితి అధ్వాన్నంగావుంది. పాఠశాలలకు చాలాచోట్ల గట్టిభవనాలు వుండడం లేదు. తరగతుల గదులు చాలినన్ని లేనికారణంగా విద్యార్థులు క్రిక్కిరిసి కూర్చుంటున్నారు. క్లాసులో అవసరమయ్యే బ్లాక్‌బోర్డులు, ఇతర పరికరాలు వుండడంలేదు. ప్రాథమిక పాఠశాలలలో సుమారు 40శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలుగా పనిచేస్తున్నాయి. అటువంటి పాఠశాలలలో ఒకటినుంచి అయిదవ తరగతి వరకు ఒకే ఉపాధ్యాయుడు పిల్లలకు బోధించవలసివస్తున్నది. అలాంటి పరిస్థితులలో ఉపాధ్యాయుడు తనవృత్తికి ఎంతవరకు న్యాయం చేకూర్చగలడో ఆలోచించవలసివున్నది. ఆ ఉపాధ్యాయుడు సెలవు కావాలంటే మరొక పాఠశాలలోని ఉపాధ్యాయునికి పనిని అప్పజెప్పి వెళ్ళవలసి వుంటుంది. సింగిల్ టీచర్ స్కూళ్ళలో భవన వసతి వుండడంలేదు. పిల్లలకు బోధించడానికి అవసరమైన ఇతరసామగ్రికూడా వుండడం లేదు.

మరొక ముఖ్య విషయాన్నికూడా గమనించవలసి వుంది. పెద్ద గ్రామంలో మూడు నాలుగు ప్రాథమిక పాఠశాలలు పనిచేస్తున్నాయి, అందులో హరిజనులకు, ఇతర బలహీన వర్గాలకు ప్రత్యేకముగా పాఠశాలలు వుంటున్నాయి. దీనివలన అనేక అనర్థాలు కలుగుతున్నాయి. హరిజన విద్యార్థులకు ప్రామాణికబోధన అందడములేదు. పైపెచ్చు వారిలో సాంఘికంగా వెనుకబడిన వారమనే అభిప్రాయం ఎక్కువగా వుంటున్నది. హరిజన పిల్లలకు, అగ్రకులాలకు చెందిన పిల్లలకు ఒకేచోట విద్యాబోధన జరిగితే హరిజన పిల్లలకు మానసిక వికాసం పెరగ గలదు. పిల్లలంతా కలసి ఒకేచోట చదువుకొంటూ, ఆడుతూ పాడుతూ ఉండటంచేత లేతమనస్సులను సాంఘిక వ్యత్యాసాలు ప్రభావితం చేయలేవు. సమానత్వాన్ని వారు అలవాటు చేసుకొనగలరు. గ్రామ జనసంఖ్యనుబట్టి పాఠశాలలు నెలకొల్పాలి. అవసరమైన వాటిని తీసివేయాలి. అప్పుడే పాఠశాలలు సమర్థవంతంగా నడుస్తాయి. బోధనా ప్రమాణాలు పెరుగుతాయి.

## ఉపాధ్యాయుల కడగళ్ళు

ప్రాథమిక పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల ఒత్తిడులకు లోనవుతున్నారు. ఇది గర్హించవలసిన విషయం. పిల్లలభవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించవలసిన సంగతి స్థానిక రాజకీయ నాయకులు గుర్తించాలి. నెలల తరబడి జీతాలు లేక కొన్ని ప్రయివేటు పాఠశాలలలో ఉపాధ్యాయులు ఆర్థిక పరమైన ఇక్కట్లకు గురవుతున్నారు. ఈవిషయంలో ప్రభుత్వం సత్వర చర్యలు తీసికొనాలి. ఉపాధ్యాయుల జీతాల స్కేళ్ళలో గల అవకతవకలను కూడా సవరించాలి. వీరి సమస్యలను ఎటువంటి అరమరికలు లేకుండా అర్థం చేసుకొని పరిష్కార

మార్గాలను కనుగొనాలి.

## అవకతవక విద్యా విధానం

పిల్లలలో ఎక్కువమంది అయిదవ తరగతి పూర్తికాక ముందే చదువు మానుకొంటున్నారు. ఇటువంటివారు 60 శాతం వరకువున్నారు. వాస్తవానికి వారంతా చదివిందిలేదు. పిల్లలు చదువు మానడానికి పేదరికం మొదటి కారణమైతే పిల్లల చదువుపట్ల తల్లి, దండ్రులు శ్రద్ధ తీసుకొనకపోవడం రెండవ కారణం. ప్రస్తుతం వున్న సిలబస్ పిల్లలమీద అధికభారంగా తయారయింది, దీనివలన కూడా కొందరు చదువు మానుకొంటున్నారు. ప్రభుత్వం ఈ విషయాలలో శ్రద్ధ వహించాలి. పాఠ్యాంశాలను నిర్ణయించే టప్పుడు పిల్లల వయస్సు, గ్రామాలలోని పిల్లల మానసిక స్థితిని, పాఠశాలలలోని టీచింగ్ ఎయిడ్స్‌కు సంబంధించిన సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోవాలి. విద్యా విషయాల నిర్ణయాలు తీసుకొనే టప్పుడు ఉపాధ్యాయునికి సముచిత ప్రాతినిధ్యాన్ని కల్పించాలి. పేద విద్యార్థులకు బట్టలు, భోజనం, పుస్తకాలు మొదలగునవి ఉచితంగా సమకూర్చాలి.

రాజకీయ పక్షాలుకూడా నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలి. ప్రాథమిక పాఠశాలలను వయోజన విద్యా కేంద్రాలుగా ఉపయోగించాలి. ఈ పాఠశాలల భవనాలలో రాత్రిపూట వయోజనులకు పాఠాలు బోధించాలి. అన్ని తరగతులకు చెందిన ప్రజలు ఈ విషయంలో శ్రద్ధచూపి నిరక్షరాస్యత నిర్మూలనకు తోడ్పడాలి. అప్పుడే దేశభవిష్యత్‌కు చక్కని బాట ఏర్పడగలదు.

**"ఆంధ్రజ్యోతి" సౌజన్యంతో.**



చి॥ రుద్రరాజు దుర్గా జయప్రకాశ్
శ్రీ విశ్వనాథరాజు (యండగండి, ప.గో.జిల్లా)గారి మనుమడు
జన్మదిన కానుకగా భవనినిధికి రు. 58/-

## ఐక్య ఉపాధ్యాయ ప్రకటన రేట్లు

| | |
|---|---|
| 4 వ కవరు పేజీ | రు. 300-00 |
| 2, 3 కవరు పేజీలు (ఒక్కొక్కటి) | రు. 250-00 |
| లోపలి పూర్తి పేజీ | రు. 200-00 |
| లోపలి (అర) ½ పేజీ | రు. 100-00 |
| లోపలి (పావు) ¼ పేజీ | రు. 50-00 |

## పెదనందిపాడులో విద్యాగోష్ఠి

గుంటూరు జిల్లా పొన్నూరు సమితికి చెందిన పెదనందిపాడులో యు. టి. ఎఫ్. ఆధ్వర్యాన 18-3-78 న లైన్స్ మాంటిస్సోరి స్కూలులో విద్యాగోష్ఠి జరిగింది. ఆ సమావేశంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన దాదాపు 120 మంది ఉపాధ్యాయులు ఉత్సాహంతో పాల్గొన్నారు.

తొలుత సభావేదికమీదికి అతిధులను శ్రీ యం. కృష్ణమూర్తి (బి.యిడి.) ఆహ్వానించారు. పిదప సభకు అధ్యక్షత వహించిన శ్రీ యమ్. నాసర్ (స్థానిక కళాశాల ఆంధ్రాధ్యాపకులు) తమ తొలి పలుకులలో సంఘంలో ఉపాధ్యాయుడికిగల స్థానాన్ని వివరించి, ప్రస్తుత విద్యావిధానం దౌర్భాగ్య స్థితిలో నున్నదనీ, పైపైపూతలతోగాక మౌలికమైన మార్పులతో దాన్ని సరిజేయాలనీ, దానికి ఉపాధ్యాయ ఉద్యమం పూనుకోవాలనీ ఉద్బోధించారు.

తరువాత శ్రీ మైనేని తమసుదీర్ఘోపన్యాసంలో ప్రస్తుత విద్యావిధానంలోని లొసుగుల్ని, యు.టి.యఫ్. ప్రతిపాదిస్తున్న శాస్త్రీయ నూతన ప్రత్యామ్నాయ విద్యావిధాన స్వరూపాన్నీ వివరించి, విద్యారంగంలో ఏర్పడిన సంక్షోభాన్ని నివారించటానికి ఉపాధ్యాయులంతా ఐక్యంగా నిలబడి పోరాడవలసిన అవసరాన్ని నొక్కిచెప్పేరు. దానికి యు.టి.యఫ్. అగ్రభాగాన ఉంటుందని ప్రబోధించారు.

తదుపరి స్థానిక జిల్లాపరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీటి. నారాయణదాసుగారు మాట్లాడుతూ 'ఖాళీ పోస్టుల్ని నింపకుండా మేనేజిమెంటు తాత్సారం చేస్తున్నదనీ, దానివల్లపబ్లిక్ పరీక్షా ఫలితాలు దెబ్బతింటున్నాయనీ, దానివల్లవచ్చిన దుష్ఫలితాల్ని ఉపాధ్యాయులపై రుద్ది టార్గెట్ల రూపంలో బెదిరింపుల్ని, శిక్షల్ని జారీ చేస్తున్నారనీ ఆ అవాంఛనీయ పరిస్థితుల్నీ, దుష్పరిణామాల్నీ ఎదుర్కొని ఐక్యంగా పోరాడాలని అన్నారు.

పిదప జిల్లా యు.టి.యఫ్. ప్రధాన కార్యదర్శి శ్రీ టి. అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యు. టి. యఫ్. కార్యక్రమాన్ని దాని సమరశీల పాత్రను వివరించారు. యు. టి. యఫ్. అధ్యక్షులు శ్రీ రాయన్న వివిధ సమస్యల్ని ప్రస్తావించి ఉపాధ్యాయులంతా సంఘటితం కావలసిన అవసరాన్ని తెల్పారు.

పొన్నూరు సమితి యు. టి. యఫ్. అధ్యక్షులు శ్రీ యం. రాధాకృష్ణమూర్తి సమితి స్థాయికృషి రిపోర్టు, క్యాంపెయిన్ల వివరాలు ఇచ్చారు. పిదప శ్రీ దానియేలు సంఘ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల్ని ఎలా ఆకర్షిస్తున్నదీ చెప్పి సమితిలో యు. టి. యఫ్. కు ఉజ్వల భవిష్యత్తు ఉన్నదని అన్నారు. శ్రీ జి. జయరావు వందన సమర్పణతో గోష్ఠి కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.

సభకు స్థానిక లైన్స్ మాంటిస్సోరి స్కూలు టీచర్లు అన్ని విధాలా తోడ్పడి అతిథిమర్యాదలు సమకూర్చారు. వారందరికి సమితి యు.టి.ఎఫ్. శాఖ అభినందనలు తెల్పింది.

ఈ విద్యాగోష్ఠి ఉపాధ్యాయులలో గణనీయమైన సంచలనాన్ని తెచ్చింది. యు. టి. ఎఫ్. అన్ని హైస్కూళ్ళకు ఇప్పటికే వ్యాపించింది. క్రమ క్రమముగా సమితి అంతటికీ వ్యాపింపజేయటానికి కార్యకర్తలు పని విభజన చేసుకొన్నారు. పత్రికా వ్యాప్తికి పూనుకొన్నారు. శ్రీ రమేశ్, కృష్ణమూర్తిగార్ల ఆధ్వర్యాన దళంగా కదులుతున్నారు.



## రాష్ట్ర యు. టి. యఫ్. పక్షాన విద్యాశాఖా మంత్రితో రాయబారాలు

రాష్ట్ర యు. టి. యఫ్. పక్షాన తే 16-3-78 న విద్యాశాఖా మంత్రిని కలిసి రాష్ట్రవ్యాప్త ధర్నా సందర్భాన డిమేండ్ చేయబడిన కోర్కెల్ని సమర్పించటం జరిగింది. ఉపాధ్యాయులకు లోగడ ఇచ్చిన అనేక హామీలు అమలుజరగలేదనీ, సాటి ప్రభుత్వోగుల కున్న అనేక సౌకర్యాలు ఉపాధ్యాయులకులేవనీ, ఆపైన అ౦నపు ధారాలుకూడా మోసబద్దాయనీ, ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులనుకూడా స్థానిక మేనేజిమెంట్లు అమలుజరపటంలేవనీ, వాటిని పరిష్కరించ టానికి సంఘం తరపున అనేక విజ్ఞప్తులు, రాయబారాలు, మహా విజ్ఞాపన పత్రాలు సమర్పింపబడ్డాయనీ, అప్పటికీ పరిష్కారం కానందున రాష్ట్రవ్యాప్తంగా 2500 మంది టీచర్లు మొదటిదళ కార్య క్రమంగా వివిధ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా జరిపారనీ, వాటన్నిటినీ పరిశీలించి వెంటనే పరిష్కరించాలనీ మెమోరాండంలో 23 సమస్యల్ని సమర్పించి చర్చించటం జరిగింది. అంతట విద్యాశాఖామంత్రి సమస్యా పరిష్కారానికి తమ సుముఖత తెల్పుతూ సంఘంతో సమన్వయ సమావేశానికి త్వరలో తేదీ నివ్వ గలమని హామీ యిచ్చారు.

పిదప విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాలవిద్యాడైరెక్టర్‌గార్లను కలిసి ఆర్టు/క్రాఫ్టు టీచర్లకు పదవ తరగతి తొలగింపు, సరెండర్ లీవు, 68 పూర్వపు ఎరియర్స్, ఎయిడెడ్ పాఠశాలల గ్రాంటురిలీజు, బి పి.యం.ల సమస్య, మొదలగు వానిపై మెమొరాండాలిచ్చి చర్చలు జరపటం జరిగింది. వాటిపై వెంటనే ఆర్డర్లు ఇస్తామన్నారు. తరువాత ప్రభుత్వ పరీక్షల కమీషనర్‌ను కలిసి టి.యస్.యల్.సి. సెకండరీ గ్రేడ్ పరీక్షలను లోగడ ఇచ్చిన అవకాశాలు 7 మార్చితో ముగిసిన కారణంగా పలువురు అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారన్న విషయం తమదృష్టికి లోగడ తెచ్చామనీ, మరో రెండు అవకాశాలు ఇస్తామని హామీ ఇచ్చారనీ, కాని ఈ నాటికి తగుచర్య గైకొనబడలేదనీ, అలాగే గతపరీక్షలలో మార్కుల కన్సెషన్ ఇచ్చిన తర్వాత ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితా ఈ నాటికీ వెలువరించలేదనీ, వాటిపై సత్వరచర్య తీసుకోవాలనీ విజ్ఞప్తి చేయగావారు వెంటనే తగు ఉత్తర్వులిస్తామన్నారు.

అలాగే ప్రభుత్వ పరీక్షల జాయింట్ శక్రటరీగార్ని కలిసి కాకినాడ తాలూకా, తార్లమూడికి చెందిన శ్రీ సత్యప్రకాశరావు సెకండరీగ్రేడ్ సర్టిఫికెట్ వెంటనే ఇవ్వాలని కోరటం జరిగింది. మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ డైరెక్టరుగార్ని కలిసి కాకినాడ మునిసి పాలిటీలో ప్రమోషన్ విషయంలో జరిగిన అన్యాయాన్ని సంవత్స రాల తరబడి పేరుకొంటున్న సమస్యల్ని వివరించారు. తగుచర్యలు తీసుకోగలమని వారుకూడ హామీ యిచ్చారు.

పై రాయబారవర్గంలో రాష్ట్ర సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ కె. నారాయణరావు, శ్రీ ఎ. వెంకటస్వామి, కార్యదర్శులు యం. నరహరి, పి. సత్యనారాయణగార్లు పాల్గొన్నారు అధికారులతో సంప్రదింపుల్లో శాసన మండలి సభ్యులు శ్రీ యం. మాధవరావు, శ్రీ యం. జె. మాణిక్యారావుగార్లు విశేషంగా సహక రించారు.

## ఫేప్టో పక్షాన రాయబారం

సుమారు సంవత్సరం క్రితం మాజీ విద్యామంత్రికి అందజే సిన మెమొరాండంలోని సమస్యలను వెంటనే పరిష్కరించ వలసిం దిగా కోరుతూ, ఫేప్టో ఆధ్వర్యాన ఒక ప్రతినిధివర్గం మార్చి 13 న విద్యామంత్రి శ్రీ బి. వెంకట్రామిరెడ్డిని కలుసుకొని, ఒక మెమొ రాండం సమర్పించింది. ప్రతినిధి వర్గంలో రాష్ట్ర టీచర్సు యూని యన్, ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్సు ఫెడరేషన్, ఆంధ్రప్ర దేశ్ పంచాయతీరాజ్ టీచర్సు గిల్డు, ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ స్కూల్స్ స్టాఫ్ అసోసియేషన్, తెలంగాణా ఎయిడెడ్ అండ్ ప్రైవేట్ స్కూల్ టీచర్సు గిల్డు ప్రతినిధులు వున్నారు.

ప్రస్తుత శాసనసభ సమావేశంలోనే సమగ్రమైన విద్యాబిల్లు ఆమోదించవలసిందిగా మెమోరాండంలో విజ్ఞప్తిచేశారు. కానుమోలు జూనియర్ కళాశాల ఉపాధ్యాయుల, నాగారం హైస్కూలు, గుడివాడలోని శ్రీహరి హిందూ ఎయిడెడ్ అప్పర్‌ప్రైమరీ స్కూలు ఉపాధ్యాయుల పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. అన్ని మేనేజిమెంట్ల క్రింద పనిచేసే ఉపాధ్యాయులకు ప్రతినెల చివరి వర్కింగ్ రోజున వేతనాలు యిచ్చేటట్లు చర్యలు తీసుకోవలసినది గాను, స్థానిక సంస్థలు ఎయిడెడ్ మేనేజిమెంట్లలో ఉపాధ్యాయుల నియామకానికి గరిష్ఠ వయోపరిమితి 30 సంవత్సరాలు ఉపసంహ రించుకోవలసిందిగాను కోరారు.

వివిధ సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తానని మంత్రి హామీ యిచ్చారు. వేతనాలు చెల్లింపని వారి విషయంలో తీవ్రచర్యలు తీసుకుంటానని హామీ యిచ్చారు. విద్యాబోధనను అభివృద్ధిపరచే విషయంలో ప్రభుత్వంతో సహకరింప వలసిందిగా విజ్ఞప్తి చేశారు.

**వింజమూరు సమితి:** సమితి నూతన కౌన్సిల్ సమావేశం 11-3-78 న శ్రీ కె. ఖాజావలి అధ్యక్షతన జరిగింది. నెల్లూరు జిల్లాశాఖ అధ్యక్ష ఉపాధ్యక్షులు శ్రీ యం. పోతురాజు, గంపా వెంకటేశ్వర్లు, ఉదయగిరి సమితిశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నారాయణరెడ్డి కౌన్సిల్‌కు హాజరై సందేశాలిచ్చారు. పిదప శ్రీ యం. పోతురాజు అధ్వర్యాన ఎన్నికలు నిర్వహింపబడ్డాయి. అధ్యక్షు లుగా శ్రీ యం. సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా సర్వశ్రీ ఎ. వి. రాఘ వులు, యస్. వి. సుబ్రహ్మణ్యం, యం. వెంగయ్య, జి. గోపాల రెడ్డిగార్లు ప్రధాన కార్యదర్శిగా శ్రీ యం. జార్జి, కార్యదర్శులుగా సర్వశ్రీ యల్. నర్సయ్య, పి. మాలకొండయ్య, కె. మాలకొండయ్య యస్. కె. అహమ్మద్‌బాషా గార్లు మరి 8 మంది కార్యవర్గసభ్యులు నల్గురు జిల్లా కౌన్సిలర్లు ఎన్నికయ్యారు.

ఆ రోజునే సమితి బి. డి. ఓ. గారికి వివిధ సమస్యలతో మెమోరాండం ఇచ్చి చర్చించటం జరిగింది. సమితిశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ యం. సుబ్బారావు, జి. ఎం. జార్జిగార్లు, జి. గోపాలరెడ్డి, అహ్మద్‌బాషా, ఎస్. కె. ఖాజావలిగార్లు జిల్లాశాఖ

అధ్యక్షుడు శ్రీ యం. పోతురాజు అధ్వర్యాన చర్చల్లో పాల్గొన్నారు. మొత్తం 30 సమస్యలపై చర్చించటం జరిగింది. వాటన్నిటిపై 26-3-78న సమన్వయ సమావేశంలో తగునిర్ణయం చేయగలనని శ్రీ బి.డి.ఓ. హామీయిచ్చారు.

**పాలకొల్లు పట్టణశాఖ :** 18-3-78 న పాలకొల్లు పట్టణశాఖ నూతన జనరల్ కౌన్సిల్ సమావేశం శ్రీ జి.ఎ.ఫిలిప్‌గారి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ జి. యస్. ప్రసాద్ కృషి, ఆర్థిక నివేదికలు ప్రవేశ పెట్టారు. అవి చర్చానంతరం ఆమోదింపబడ్డాయి. పిదప అధ్యక్షులుగా శ్రీ జి. ఎ. ఫిలిప్, ఉపాధ్యక్షులుగా శ్రీవి. నరసింహరాజు, ఎ. వెంకట్రామయ్యగార్లు ప్రధాన కార్యదర్శిగా శ్రీ జి. యస్. ప్రసాద్, కార్యదర్శులుగా శ్రీ బి. సీతారామశాస్త్రి, యి. వెంకట్రావుగార్లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

**కైకలూరు సమితిశాఖ :** కృష్ణాజిల్లా, కైకలూరు సమితి కార్యాలయంలో 5-3-78 న బి. డి. ఓ. గారితో సమన్వయ సమావేశం జరిగింది. సంఘం తరపున సమితి యు. టి. యఫ్. శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ వి. వి. రాధాకృష్ణమూర్తి, శ్రీ పి. డి. విక్టర్, జిల్లా కౌన్సిలర్ బి. సుబ్బారావు చర్చల్లో పాల్గొన్నారు. కంటింజెంట్ స్టాఫ్ జీతాలు, వారి ఎరియర్సు కేస్‌గ్రాంటు. ముస్లిం పండుగన్ని శలవుల లిస్టులో చేర్చుట, కో-ఆపరేటివ్ చెక్కులు సకాలంలో ఇచ్చుట, 77 జూన్‌లో ఎన్యూమరేషన్ వర్కు చేసిన వారికి లీవు సర్టిఫికెట్, సెలక్షన్ గ్రేడ్ వచ్చినవారి ఎరియర్స్ మొదలగు సమస్యలు చర్చించి నిర్ణయాలు తీసుకోబడ్డాయి. 12-10-77 న జరిగిన సమన్వయ సమావేశ ఫలితంగా 1970 ఎన్యూమరేషన్ చేసిన వారికి ఎరెండ్ లీవు, పాఠశాలలకు స్టేషనరీ, టేకెనోవర్ పాఠశాలల రీ పే ఫిక్సేషన్ జరిపించుట జరిగింది.

**మోత్కూరు సమితిశాఖ:** నల్గొండ జిల్లా మోత్కూరు సమితి యు టి.యఫ్. శాఖ సర్వసభ్య సమావేశం శ్రీ కె. కృష్ణమూర్తిశర్మగారి అధ్యక్షతన 19-3-78న మోత్కూరులో జరిగింది. సర్వశ్రీ పి. సత్యనారాయణ, పి. కృష్ణమూర్తి, కె. సోమిరెడ్డిగార్లు జిల్లాశాఖ తరపున హాజరై సందేశాలిచ్చారు. భువనగిరి సమితికి చెందిన శ్రీయుతులు బి. సీతారాంరెడ్డి, అనంతరామశర్మ. కె. ఉపేందర్‌రెడ్డిగార్లు ప్రత్యేకాహ్వానితులుగా హాజరయ్యారు.

శ్రీ సి.హెచ్. పిచ్చిరెడ్డి సమర్పించిన కార్యదర్శి నివేదికపై చర్చల్లో సర్వశ్రీ యం. సోములు, పి. పుల్లయ్య, బి. వెంకటరాజుగార్లు పాల్గొని ఉద్యమ వ్యాప్తికి తగుసూచనలు చేశారు. అనంతరం నూతన సంవత్సరానికి అధ్యక్షులుగా శ్రీ జి. రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీ పి. పుల్లయ్య, శ్రీ యం. సోములు ప్రధాన కార్యదర్శిగా శ్రీ జి రాంరెడ్డి, కార్యదర్శులుగా శ్రీ టి. మధుసూధనరెడ్డి శ్రీ కె. కృష్ణమూర్తిశర్మగార్లు మరి 8 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

తదనంతరం సమితి అధికారుల్ని, జడ్.పి. కార్యదర్శిగారిని, డి.యి.ఓ.గారిని వారి వారి ఆఫీసులకు చెందిన వివిధ సమస్యల్ని పరిష్కరింపవలసిందిగా కోరుతూ 12 తీర్మానాలు ఆమోదించారు.

**నిరసన దినం** 27-2-78న సామర్లకోటసమితి పి. వేమవరం స్కూలులో పనిచేస్తున్న శ్రీమతి సత్యాల్లకగారిపై గ్రామస్థుడు జరిపిన దౌర్జన్యానికి నిరసనగా యాక్షన్ కమిటీ పిలుపుపై సమితిలోని ఉపాధ్యాయులందరు 14-3-78 న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనదినం జరిపారు. దానిని బలపరుస్తూ గొల్లలమామిడాడ సెంటర్ టీచర్లు తమ నిరసన తీర్మానాన్ని పై అధికారులకు పంపేరు.

**ఉలవపాడు సమితి శాఖ :** 19-3-78 న సమితి నూతన కౌన్సిల్ సమావేశం శ్రీ టి. వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ యం. కోటయ్య ప్రవేశపెట్టిన కృషి, ఆర్థిక నివేదికల చర్చానంతరం ఆమోదింపబడ్డాయి. పిదప జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ డి. రామిరెడ్డి కొండపి సమితిశాఖ అధ్యక్షుడు శ్రీ డి. రామారావు, ఒంగోలు సమితిశాఖ కార్యదర్శి శ్రీ ఏకా నరసింహంగార్లు సందేశాలిచ్చారు. పిదప అధ్యక్షులుగా శ్రీ డి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ యం. కోటయ్య, మరి 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

**యల్లసిరి సెంటర్ :** కోట సమితికి చెందిన యల్లసిరి సెంటర్ శాఖకు సమితిశాఖ కార్యదర్శి శ్రీ యి. అబ్రహాంగారి పర్యవేక్షణలో అధ్యక్షులుగా శ్రీ కె. కృష్ణారెడ్డి, కార్యదర్శిగా శ్రీ యస్. కె. ఖాశిం, మరి నల్గురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## రాష్ట్ర రాజధానిలో ఆదిలాబాద్ జిల్లా శాఖ రాయబారాలు

23-3-78 న హైదరాబాద్‌లో శ్రీ యం. జె. మాణిక్యారావు, శ్రీ యం. మాధవరావు (ఎమ్.ఎల్.సి.లు) గార్ల నాయకత్వాన జిల్లా శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీ వి. సుబ్బారావు, శ్రీ యం. వీరారెడ్డి, మంచిర్యాల పట్టణశాఖ అధ్యక్షులు శ్రీ ఆర్. కిష్టయ్యగార్లు, విద్యాశాఖ కార్యదర్శి, పంచాయత్‌రాజ్‌శాఖ కార్యదర్శి, పాఠశాలల డైరెక్టర్, లోకల్‌ఫండ్ ఎగ్జామినర్‌గార్లను కలిసి జిల్లా ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై చర్చించారు. అధికారులు సావధానంగా విని వాటిని పరిష్కరించటానికి హామీ నిచ్చారు. పిదప విద్యాశాఖా మంత్రిని కలిసి ఇస్‌గాంలోని బెంగాలీ ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్ల గురించి మెమోరాండం సమర్పించగా మంత్రిగారు వెంటనే తగు ఉత్తర్వులకై విద్యాశాఖ కార్యదర్శిగారికి వ్రాశారు. సిర్పూర్ పంచాయతీసమితి బి.డి.ఓ. సమన్వయ సమావేశము ఏర్పాటుచేయని విషయం పంచాయితీరాజ్‌శాఖ కార్యదర్శి దృష్టికితేగా వారు వెంటనే దానిపై చర్య తీసుకొంటామని చెప్పేరు. ఇంతేగాక జిల్లాలోని ఇతర సమస్యలపై ప్రాతినిధ్యపు లేఖలు డి.యి.ఓ. గారికి, యం. యల్. సి. లు తగుచర్యలకై పంపటం జరిగింది.

**ఖమ్మం పట్టణశాఖ :** ఖమ్మంపట్టణ యు.టి.యఫ్. కౌన్సిల్ సమావేశం 19-3-78న శ్రీ ఆర్. రాఘవయ్యగారి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ బి.సుబ్బరాజు కృషిరిపోర్టు, ఆర్థిక నివేదిక సమర్పించారు. చర్చానంతరం అదిఆమోదింపబడ్డాయి. పిదప జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీ వి. మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షుడు శ్రీ సి.హెచ్. రాజారావు సందేశాలిచ్చారు. తరువాత శ్రీమల్లిఖార్జునరావుగారి పర్యవేక్షణలో అధ్యక్షులుగా శ్రీ ఆర్. రాఘవయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీ వై. వి. శర్మ, శ్రీమతి కె. సావిత్రి, ప్రధాన కార్యదర్శిగా శ్రీ బి. సుబ్బరాజు, కార్యదర్శులుగా శ్రీమతి వి. సరస్వతి, శ్రీ కె. శ్రీరామమూర్తి ఎన్నికయ్యారు. జోసుగారి వందన సమర్పణతో సమావేశం ముగింపబడింది.

